KSR02 B155 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఫిబ్రవరి 05, 2017

E
కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

వినరా సోదర..
వీర కుమారా...

బాలీవుడ్ బడి పిల్లలు..!

విలక్షణ పాత్రల్లో నటించేందుకు ఇష్టపడే బాలీవుడ్ తారల్లో కొందరు మంచి స్టూడెంట్స్‌గా పేరు తెచ్చేసుకున్నారు. స్కూల్ విద్యార్థులుగా చేసిన ఆ విలక్షణ పాత్రలకి కాస్ట్యూమ్స్ ఎంతగానో దోహదపడ్డాయి. కరణ్ జోహర్ నిర్మాతగా సోనమ్ నయర్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం గిప్పీ. ఈ సినిమాలో పదిహేనేళ్ల విద్యార్థిగా స్కూల్ డ్రస్‌లో ఒదిగిపోయింది రియావిజ్. ఈ చిత్రానికి ముందు కరణ్ నిర్మాతగా వ్యవహరించిన చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'. బాలీవుడ్ న్యూ ఎంట్రీలుగా ఆలియాభట్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్‌లకి మంచి పేరు తెచ్చిపెట్టిన ఈ చిత్రంలో స్కూల్ రాక్ బ్యాండ్ కాస్ట్యూమ్‌లో ప్రేక్షకుల మనసు దోచుకున్నారు. పూర్వవిద్యార్థిగా షారుక్ నటించిన 'ఆల్వేస్ కభీ కభీ'లో లిలెటి దూబె, సత్యజీత్ దూబె, అలీఫాజల్ వెస్టన్ స్టైల్ యూనిఫాంలో కనిపిస్తే 'వెల్డన్ అబ్బా' చిత్రంలో గ్రామీణ విద్యార్థిగా మిన్నీషా లంబా సల్వార్ కమీజ్‌లో ఆకట్టుకుంది. అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'దేవ్-డి' చిత్రంలో ఇదే తరహా పాత్ర కోసం కల్కి కొయిచ్లిన్ స్కూల్ యూనిఫామ్‌లో కనిపిస్తే రాంఝానీలో ధనుష్ తో కలసి నటించింది సోనమ్ కపూర్. మానసిక ఎదుగుదల లోపించిన విద్యార్థిగా హ్రితిక్ 'కోయి మిల్‌గయా'లో స్టూడెంట్ పాత్రలో మెప్పిస్తే 'పా' చిత్రం కోసం ఆరు పదుల వయసులో బిగ్ బి స్కూల్ యూనిఫాం వేసుకున్నాడు. 'లక్కీ' చిత్రంలో బైక్ రైడింగ్ స్కూల్ విద్యార్థిగా స్నేహ ఉల్లాల్ ధరించిన యూనిఫామ్ డిఫరెంట్ లుక్ ప్రేక్షకులని కట్టి పడేస్తే 'మొహబతేన్' చిత్రంలో జుగల్ అన్సారీ, ఆదిత్య చోప్రా, జిమ్మీ షెర్గిల్ విదేశీ విద్యార్థులుగా బ్లేజర్ యూనిఫామ్‌లతో అలరించారు.

కథా నిలయం
KSRO2B/15 5
ENTERED
శ్రీకాకుళం

మన బ్యాడ్మింటన్ స్టార్‌లు ఎవరంటే టక్కున సైనా నెహ్వాల్.. సింధు వంటి పేర్లు గుర్తొచ్చేస్తాయి. మనం ఇంకా గర్వంగా చెప్పుకోవాల్సిన మరో స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఉన్నారు. ఆమె పేరు మానసి జోషి. ఈ పేరు ఎక్కడా వినలేదే..? మరి స్టార్ అంటున్నారేంటి..? ఈ విజేత కథ పూర్తిగా చదివితే మీ సందేహం ఎగిరిపోతుంది. గుండె నిండా స్ఫూర్తి మిగిలిపోతుంది. పారా బ్యాడ్మింటన్‌లో ప్రపంచ దిగ్గజ క్రీడాకారిణిగా రాణిస్తున్న మానసి జోషి సింగిల్స్‌లో వరల్డ్ నెం.3, డబుల్స్ వరల్డ్ నెం.5 స్థానంలో ఉంది. ఆమె వరల్డ్ నెం.1 కావాలనుకుంటోంది తన గెలుపుతో తనలాంటి విభిన్న ప్రతిభావంతులకు కొండంత లక్ష్యం చిన్నగా అనిపించాలని.



షటిల్ స్టార్

బ్యాడ్మింటన్ ఎందుకో మానసి మనసంతా ఆడేస్తుంటుంది. చిన్నతనం నుంచే షటిల్ బ్యాట్ గుడ్ మార్నింగ్ చెప్పేది. తెల్లారి నుంచే ప్రాక్టీస్ మొదలయ్యేది. ఆరేళ్లకే బ్యాడ్మింటన్ ఆటపై ఆసక్తి పెంచుకుంది. తండ్రి కాక్ విసురుతూ తొలి గురువైతే ఆ తర్వాత ఆమె ప్రతిభను గుర్తించి కోచింగ్‌లో చేర్పించాడు. ఆమె ప్రతిభకు జిల్లా స్థాయి పోటీలు ఆతిథ్యమిచ్చేవి. గెలుపులు, ఓటములు క్రీడాకారుల జీవితంలో మామూలే. అవి క్రీడా స్థలిలో అయితే పర్లేదు. జీవితాన్నే వెనక్కు నెట్టేసేదైతే ఇక గెలవడం కష్టమే. కానీ మానసి గెలిచింది. తాను బ్యాడ్మింటన్ కోర్టులోనే కాదు జీవిత మైదానంలోను విజేతననే నిరూపించుకుంది. తాను కెరీర్‌లో దూసుకుపోతున్న సమయంలో 2011లో రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పుడు తన వయస్సు 22 సంవత్సరాలు. స్కూటీపై వెళుతున్న మానసిని ట్రక్కు ఢీకొనడంతో ఆమె ఎడమ కాలు నుజ్జు నుజ్జయ్యింది. ఇన్‌ఫెక్షన్ ఒళ్లంతా పాకకుండా తొడ నుంచి కాలంతా తీసేశారు. 45 రోజులు హాస్పిటల్‌లోనే గడిపింది. అప్పటి వరకు నిద్రలోను కలల్లోను కొత్త మెళకువలు సాధన చేస్తూ కోర్టంతా చలాకీగా షటిల్ అవుతున్న దృశ్యం కనిపించేది. తన రెండు కాళ్లు గాల్లో సునాయాసంగా కదిలిపోతు న్నంత సింక్రనైజ్ అయ్యేవి. మరిప్పుడు రెండో కాలు లేకుండా బ్యాడ్మింటన్ కల ఏమవుతుంది. ఇక్కడే కెరీర్ ఆగిపోతే జీవితమూ ఆగిపోతుంది కదా. కానీ ఇక్కడే తన జీవితాన్ని ఆత్మస్థైర్యంతో ముందుకు దూకించింది మానసి. పారా క్రీడల వైపు దృష్టి పెట్టి తన ప్రాణమైన బ్యాడ్మింటన్‌లోనే కొత్త కసరత్తు మొదలెట్టింది. తనకు అమర్చిన కృత్రిమ కాలుతోనే సాధన చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ఎదిగింది. ప్రపంచ దిగ్గజాలతో తలపడి ఎన్నో పతకాలు గెలిచింది.





నాన్నే ప్రేరణ

మానసి తండ్రి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్లో శాస్త్రవేత్త. టెన్నిస్ క్రీడాకారుడు, రచయిత కూడా. వీలున్నప్పుడల్లా తన సంస్థ తరపున టెన్నిస్ ఆడుతుండేవాడు. మానసికి చిన్నతనం నుండి బ్యాడ్మింటన్ ఎలా ఆడాలో నేర్పిస్తుండేవాడు. నాన్నే తనకు ప్రేరణ. ముంబాయిలో ఉంటున్న మానసి చదువులోను ప్రతిభ చూపింది. శాస్త్ర సాంకేతిక రంగాలంటే చాలా ఇష్టం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఓ పెద్ద సంస్థలో ఉద్యోగం కూడా సంపాదించింది. ఒక పక్క ఉద్యోగం మరో వైపు క్రీడా కెరీర్‌లోను ముందుండేది. 2012 ఆగస్ట్‌లో సంస్థ నిర్వహించిన బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఆ గెలుపే ఆమెలో ఆత్మస్థైర్యాన్ని రెట్టింపు చేసింది. 2014 ఏషియన్ గేమ్స్‌కు మహారాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. ట్రయల్స్‌లో ఎంపిక కాలేకపోయినా ఎందరో స్నేహితులు అయ్యారు. వారిలో అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ ఆటగాడు నీరజ్ జార్జ్ కూడా ఉన్నాడు. ఆయన మానసిలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాడు. 2014 డిసెంబర్‌లో జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో ఆడి రజతం గెలుచుకుంది. ఆ మ్యాచ్ తనకెంతో ప్రత్యేకమైంది. ఎందుకంటే అర్జున అవార్డు గ్రహీత పారుల్ పర్మార్‌తో ఆడి విజయం సాధించింది. 2015 మార్చిలో 5వ స్పానిష్ పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్‌కు ఎన్నికైంది. తిరిగి 2015 సెప్టెంబర్‌లో ఇంగ్లాండులో జరిగిన బిడబ్ల్యుఎఫ్ పారా బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లోనూ ఆడింది. ప్రపంచ ఛాంపియన్ రాకేష్ పాండేతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఆడి అద్భుత విజయాలు సాధించింది.

- కుమారి

ఇండెక్స్

ప్రత్యేకం..................3

నాలుగేళ్లకే 1000 పుస్తకాలు

స్టార్........4

దిశ మారింది

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10

ట్రంప్ కార్డ్..!

వినూత్నం............... 11

రైతు కట్టిన మ్యూజియం

కవిత్వమ్...............14

ఆకలి తీర్చుతుంది

తెలుసా...................15

సైన్స్ అండ్ షీ

వినరా సోదర

వీర కుమార

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12

లాహిరి లాహిరి

లాహిరిలో...

కథ..... 16

అభాగ్యుడు

వివరం 20

రహస్య గ్రంథాలయాలు

రుచి.......................21

ఆలూ కొత్తిమీర రైస్

బాల నేస్తాలు.............23

పెద్ద చెవుల గబ్బిళం

పద వికాసం.....

....24

రాజకీయ ఉద్దేశ భక్తి

ఈ వారం అట్టమీది కథలో రాజకీయ ఎత్తుగడలని వివరంగా తెలిపిన తెలకపల్లి రవి గారికి అభినందనలు. బారిష్టర్ల బహుమానం మరింత వివరణాత్మకంగా అందించడం బాగుంది. చిన్న చిన్న లోపాలను ఆసరా చేసుకుని ఎన్నికైన పార్టీలు అణగారిన వర్గాలను మరింత అణచి వేస్తున్నాయి. నాటి బూర్జువా పాలనలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ఇప్పుడు జరగాలి. దేశభక్తి అందరిలో వుంటుంది. అది నెమరవేసుకుంటే వచ్చేది కాదు. దేశ ప్రజల సంక్షేమం కోసం పనిచేయడమే నిజమైన దేశ భక్తి. లేకుంటే అది ఉద్దేశభక్తిగా చరిత్రలో నిలిచిపోతుంది. అమ్మకు ఉన్నంత ముందు చూపు జ్ఞానం మరెవ్వరికీ వుండదేమో. పొదుపు, భవిష్యత్ ఆలోచనలు ఇవన్నీ అమ్మ మాత్రమే చేయగలదు. అందుకే ఆ అమ్మ ఇల్లు కట్టి చూపించింది. ఇటువంటివి చూసైనా ప్రభుత్వాలు స్పందించాలి. సాహిల్ సాగర్ ప్రదర్శన బాగుంది. అరచేతిలో ఇమిడిపోయే చిన్న కళాకృతులతో విశాల విషయాలని చెప్పిన సూక్ష్మంలో బాగుంది.

-బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆమదాలవలస



పుస్తక జాతర

స్నేహ వీక్లీలో ప్రచురించిన పుస్తక జాతర విజ్ఞానదాయకం. ఉద్యమకారులకు అక్షరం మొదటి ఆయుధం. జ్ఞాన సముపార్జనలో మొదటి మెట్టు పుస్తక అధ్యయనం. ప్రపంచస్థాయి బుక్ ఫెయిర్‌లు అందుకు దోహద పడతాయి. చెన్నై, పాట్నా, బెజవాడ బుక్ ఫెయిర్‌లు అలరించాయి. టెక్నాలజి అభివృద్ధి చెందినప్పటికీ పుస్తకాలకు మించిన జ్ఞానం ఇంకొకటి వుండదంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి బుక్‌ఫెయిర్‌ల ద్వారా కోట్లాది మంది పుస్తకాలు చదివేందుకు ప్రభావితులవుతున్నారు.

ఎన్నో మంచి విషయాలని మాకు అందిస్తున్న స్నేహకు అభినందనలు.

-తుంపాల శ్రీరామ్మూర్తి, గాజువాక

ఆకట్టుకున్న కాశ్మీర్ అరుపు

కాశ్మీర్ పేరు చెప్పగానే రాళ్ల వర్షం, బుల్లెట్ల వడగళ్లు, కల్లోల దృశ్యాలు కళ్లను చెమర్చుతాయి. గుండెల్ని పిండే ఆ దృశ్యాల్ని పెయింటింగ్‌ల రూపంలోకి తెచ్చి మార్పుకు కృషి చేస్తున్న ఒమర్ హఫీజ్‌కు హ్యాట్స్ ఆఫ్.

మహిళా సాధికారత, లైంగిక హింస, బాలల విద్య వంటి వాటిపై చర్చలు నడపడం, మానవతా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. అనగనగా ఓ కూరలమ్మ కథ, దృశ్యం ప్రకృతి చిత్రం కవిత, పూల లోకం, కుక్క ఉన్ని, గుహలో పదేళ్లుగా, మేం తోడొస్తాం, ఈ ఎమ్ ఎస్ అకాడమీ, రాజకీయ ఉద్దేశభక్తి అట్టమీది కథ, దంగల్ గెలిచింది, పేదింటి సారె ఆకట్టుకున్నాయి. అరచేతిలో ఇమిడిపోయేంత చిన్న కళాకృతుల్లో విశాలమైన విషయాల్ని చెప్పే సూక్ష్మ కళలు అబ్బురపరిచాయి.

- హిమబిందు, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ప్రత్యేకం



నాలుగేళ్లకే 1000 పుస్తకాలు

ఓ నాలుగేళ్ల చిన్నారి ఓ ప్రఖ్యాత గ్రంథాలయానికి అధికారి కాగలదా. 'మేక్ ఏ విష్' వంటి సామాజిక సంస్థలు పసి మనసుల్లోని ఆశల్ని తెలుసుకుని అప్పుడప్పుడూ వారిని ఒక్క రోజు, ఒక్కసారి పోలీస్ అధికారినో, స్టార్‌నో చేస్తూ కాసింత సంతోషాన్ని పంచుతుంటారు. కానీ ఈ చిన్నారి ఒక్క రోజు లైబ్రేరియన్‌గా మారిందిలా కాదు. బుల్లి పుస్తకాల పురుగు దాలియా తన చదువరితనంతో ఆకట్టుకుని ఈ ఛాన్స్ కొట్టేసింది. అమెరికాలోని నేషనల్ లైబ్రరీలో ఒక్కరోజు లైబ్రేరియన్‌గా విధులు నిర్వహించి వార్తల్లో నిలిచింది. నాలుగేళ్లకే 1000 పుస్తకాలపైనే చకచకా చదివేస్తూ పుస్తకాల్ని చప్పరించేస్తోంది.

దాలియాహ్ తల్లి హలీమా అరోరా గర్భిణీగా ఉన్నప్పుడు కాలక్షేపం కోసం కొంతమంది పిల్లలకు పుస్తకాలు చదివి వినిపిస్తుండేది. ఆ పదాలన్నీ తల్లి గర్భం నుండే వంటబట్టించుకుంది దాలియాహ్. నెలల శిశువుగా ఉన్నప్పుడు గిన్నెస్‌విల్లెలోని తన ఇంటిలో అన్నయ్య తరగతి పాఠాలను పెద్దగా చదువుతుంటే ఊయలలో ఉన్న దాలియాహ్ చెవులు రిక్కించి వినేదట. ఒకటిన్నర సంవత్సరం కావడమే ఆలస్యం అమ్మ చదివిన పుస్తకాల్లోని పదాలన్నీ ఎవరి సాయం లేకుండానే సొంతంగా చదవటం మొదలెట్టింది. 2 సంవత్సరాల 11 నెలలకు ఏకంగా పుస్తకాన్నే చదివి తనలోని ప్రత్యేకతను చాటింది.

పుస్తకాల పురుగు

దాలియా చదివినవాటిలో కాలేజీ పుస్తకాలు కూడా ఉండటం విశేషం. చిన్నారిలోని అసాధారణ ప్రతిభ నేషనల్ లైబ్రరీ లీడరైన కార్లా హైడెన్‌ను ఆకట్టుకుంది. ఆమె ఈ చిన్నారిని వాషింగ్‌టన్‌లోని 14వ లైబ్రరీ కాంగ్రెస్‌కు ఆహ్వానించి ఒక్కరోజు లైబ్రేరియన్‌గా ఉండే అరుదైన అవకాశాన్ని కల్పించింది. లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్‌కు వెళ్లిన దాలియాహ్ నేరుగా ఎగ్జిక్యూటివ్ రౌండ్ టేబుల్‌లో అధికారుల సరసన కూర్చుంది. ఒక మహిళ లైబ్రేరియన్ కావడం ఇదే మొదటిసారి.

ప్రపంచంలోనే పెద్ద లైబ్రరీ అయిన లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ అంటే దాలియాకి చాలా ఇష్టమని అరోరా అంటుంది. పుస్తకాల పురుగు దాలియాహ్‌కు సొంతూరిలో హాల్ కౌంటీ లైబ్రరీ తనకు కొత్తేమీ కాదు. తనకు ఆ లైబ్రరీలో సభ్యత్వ కార్డు కూడా ఉంది. ప్రతిరోజూ లైబ్రరీలోని పుస్తకాలన్నీ తనిఖీ చేయడం, తోటి పిల్లలకు తను నేర్చుకున్నది చెప్పడం అంటే ఇష్టమని

దాలియాహ్ అంటోంది. దాలియాహ్ పుస్తకాలను ఏకధాటిగా చదవడం చూసి తన తల్లికి ఒక ఆలోచన వచ్చింది. దాలియాహ్ చదివే పుస్తకాలన్నింటినీ లెక్క పెట్టడం ప్రారంభించింది. కిండర్‌గార్టెన్‌కు ముందే అంటే 3ఏళ్లకే వెయ్యి పుస్తకాలను చదివిన దానియా. కిండర్‌గార్డెన్ పూర్తయ్యేనాటికి 1500 పుస్తకాలు చదవటమే లక్ష్యంగా పెట్టుకుంది. స్కూలులో టీచర్‌కు సాయంగా తను కూడా పిల్లలకు ఎలా చదవాలో నేర్పిస్తుంది. 10-12 సంవత్సరాలున్న అన్నయ్యల పుస్తకాలను అవలీలగా చదివే సామర్థ్యం ఉంది. ఎక్కడైనా కష్టమైన పదాలు వచ్చినప్పుడు మాత్రమే ఆగుతుంది. దాలియాహ్‌కు ఎమ్‌ఓ విలియమ్ రాసిన 'పీజియన్', 'ఎలిఫెంట్ అండ్ పిజ్జీ' సిరీస్‌లంటే ఇష్టం. డైనోసార్స్ గురించి ఇక చెప్పక్కర్లేదు. వాటి గురించి లోతుగా తెలుసుకుంది. ఏదో ఒకరోజు డైనోసార్ శిలాజాలను తవ్వించే పాలిన్‌టాలాజిస్ట్ (paleontologist) కావాలని కోరిక.

ఒకసారి అరోరా దాలియాహ్‌కు విలియమ్ ఎల్ రాసిన 'ద ప్లెజర్ ఆఫ్ బుక్స్' అనే కాలేజీ పుస్తకంలోని ప్రసంగాన్ని చెప్పమని సవాలు విసిరింది. ఆశ్చర్యం..అద్భుతం ఆ చిన్నారి అందులోని ప్రతి పదాన్ని ఎటువంటి దోషాలు లేకుండా ఉచ్చరిస్తూ విడమరిచి వివరించడంతో అరోరాకు నోట మాట రాలేదు. తనలాగా అందరు తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే తమ పిల్లలను ప్రోత్సహించాలని దాలియాహ్ వీడియోలను యూట్యూబ్‌లో పెట్టింది అరోరా. దాలియాహ్‌కు చదివేటప్పుడు స్పష్టత అవగాహనా శక్తి రావడానికి కారణం వాళ్ల ఇంట్లో రెండు భాషలు మాట్లాడటమే. దాలియాహ్ నాన్న మిజ్యూఎల్(miguel)అరానా మెక్సికన్ అయినందున ఇంట్లో దాలియాహ్ స్పానిష్‌లోనే మాట్లాడుతుంది. సహజంగా 4 ఏళ్ల పిల్లలు స్పష్టంగా మాట్లాడటమే కష్టం. కానీ దాలియాహ్ మాత్రం స్పానిష్ భాషను ఉపయోగిస్తూ స్పష్టంగా మాట్లాడుతుంది. ఒక్కరోజు లైబ్రేరియన్ అనుభవంతో తమ పాప మంచి స్థాయికి చేరుతుందంటున్నారు తల్లిదండ్రులు.

లైబ్రరీలోని చిన్నపిల్లల విభాగంలో పర్యటించిన దాలియాహ్ లైబ్రరీ హాల్‌లో తెల్ల బోర్డు మీద అక్షరాలు రాసి చూపితే పిల్లలకు బాగా అర్థమవుతుందని సలహా చెప్పింది. ఆరోజు హైడెన్‌తో కలిసి పుస్తకాలు చదివిన తర్వాత లైబ్రరీ అధికారులందరినీ పరిచయం చేసింది.

ఒక్కరోజు లైబ్రేరియన్‌గా అయినందున తనకే కాక తన ఊరికి కూడా గుర్తింపు వచ్చింది. అక్కడ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ 'డే' రాసిన 'ఐ హ్యావ్ ఎ డ్రీమ్' పుస్తకంలోని ప్రసంగాన్ని వివరించమని అడిగారంటే దాలియాహ్ తెలివితేటలు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

దిశ మారింది

లోఫర్ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది దిశా పటానీ. మోడలింగ్‌తో కెరీర్‌ని ప్రారంభించిన ఈ అమ్మాయి జీవితం ప్రకటనల రంగంలో మలుపు తిరిగింది. 'ధోని' బయోపిక్ చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన దిశా కెరీర్ వెంటనే దశ మారింది. జాకీచాన్‌తో కలిసి నటించిన 'కుంగ్‌ఫూ యోగా'తో అంతర్జాతీయ నటి స్థాయికి చేరిపోయింది.

దిశా పటాని 13 జూన్ 1992లో బరేలిలో జన్మించింది.

◆కుటుంబ సభ్యుల్లో ఎక్కువ మంది ఎయిర్ ఫోర్స్‌లో సేవలు అందిస్తున్నారు.

◆తండ్రి, అన్న ఇద్దరూ వాయుసేనలోనే ఉండటంతో చిన్న తనం నుంచి పైలట్ కావాలనుకుంది దిశా.

◆స్వతంత్ర ఆలోచనలతో ఉండే దిశాని టామ్‌బాయ్ అని పిలుస్తారు స్నేహితులు.

◆ప్లస్ టూ పూర్తిచేసిన తర్వాత తన ఆలోచనలు మోడలింగ్ వైపుకి మారడంతో 19 ఏట ముంబయ్ చేరుకుంది.

◆చదువులో తను తెలివైన విద్యార్థిని. నోయిడాలోని ఓ ప్రముఖ కళాశాలలో బిటెక్‌లో చేరినా మోడలింగ్ అవకాశాలు రావడంతో చదువు పక్కన పెట్టింది. దిశా ట్రెయిన్డ్ జిమ్నాస్ట్ కూడా.

◆ఎలాంటి శిక్షణ లేకుండానే మోడలింగ్‌లో ప్రవేశించిన దిశాకు మార్గం చూపేవారు ఎవరూ లేరు. దొరికిన ప్రతి ఆడిషన్‌కు హాజరయ్యేది. ఇలానే ఎన్నో మోడలింగ్ మెళకువలు నేర్చుకుంది. అందుకే తను ఫెయిలయిన ఒక్కో ఆడిషన్ తనకి కొత్త పాఠాలు నేర్పాయంటుంది.

◆కెరీర్ మోడలింగ్‌తో ప్రారంభమైనా ఎక్కువమందికి తను గుర్తిండిపోయింది యాడ్స్‌తోనే.

◆టివి కమర్షియల్స్‌తోనే కుర్రకారు మనసు దోచుకున్న ఈ అమ్మాయిని వెతుక్కుంటూ సినీ అవకాశాలు వచ్చేశాయి.

◆బైట వ్యక్తులతో చొరవగా మాట్లాడడానికి జంకు వున్నా కెమెరా ముందుకు రాగానే ఎలాంటి బెరుకు లేకుండా ఫ్రీ అయిపోయేది. కెమెరా ముందుకు రాగానే తనలోని బెరుకు పోయేదట.

◆ఈ కెమెరా ఫ్రెండ్లీ స్వభావమే తను మోడలింగ్, కమర్షియల్స్‌లో ఎదగడానికి దోహదపడింది.

◆2013లో ఫెమినా మిస్ ఇండియా ఇండోర్‌లో మొదటి రన్నరప్‌గా నిలిచిన దిశాకి ఎమ్ ఎస్ ధోని బయోపిక్ 'ధోని'లో హీరోయిన్‌గా బాలీవుడ్‌లో తొలి అవకాశం లభించింది. ఈ చిత్రం కోసం జార్ఖండ్ అదీవాసీలు మాట్లాడే అసురి మాండలి కాన్ని నేర్చుకుంది.

◆'భాగీ' చిత్రం ప్రిప్రొడక్షన్ సమయంలో టైగర్ ష్రాఫ్ తనకి తొలిసారిగా పరిచయమ య్యాడు. అయితే తన స్థానంలో శ్రద్ధా కపూర్‌ని తీసుకోవడంతో ఆ చిత్రం నుంచి తను వెనుదిరగాల్సి వచ్చినా వ్యక్తిగత జీవితంలో టైగర్ తనకి మంచి స్నేహితుడు.

◆సినీ ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు టైగర్ గొప్ప సహకారాన్ని అందించి కొత్త ప్రాజెక్టులు వచ్చేలా చేశాడని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.

◆కరణ్ జోహర్ చిత్రానికి దిశా సైన్ చేసింది. అయితే చిత్ర ప్రారంభంలో జాప్యం జరగడంతో ఈ చిత్రం నుంచి తప్పుకుంది.

◆సినిమాల్లో అవకాశాలు తగ్గినా మోడలింగ్, యాడ్స్‌లో అవకాశాలు తగ్గలేదు.

◆2015లో 'లోఫర్' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలో తన సత్తా చాటుకుంది.

◆గత సంవత్సరం మీట్ బ్రదర్స్ కంపోజిషన్‌లో వచ్చిన 'బేఫికర్' మ్యూజిక్ ఆల్బమ్‌లో టైగర్ ష్రాఫ్‌తో కలిసి నటించింది దిశా. టి-సిరీస్ ప్రొడక్షన్‌లో విడుదలైన ఈ ఆల్బమ్ తనకి పెద్ద హిట్‌నిచ్చింది.

◆ఈ ఏడాది స్టాన్లే టాంగ్ దర్శకత్వంలో వస్తున్న ఎడ్వెంచరస్ కామెడి యాక్షన్ చిత్రం 'కుంగ్ ఫూ యోగా'లో ప్రపంచ స్థాయి నటుడు జాకీచాన్‌తో కలిసి నటించే అవకాశం దిశాకు దక్కింది.

◆మ్యాండరిన్, హిందీ, ఇంగ్లీష్ త్రిభాషా చిత్రంగా కుంగ్ ఫూ యోగా ఈ నెల 28న విడుదలై మంచి విజయాన్ని పొందింది.

◆కథతో పాటు తన పాత్రకి బలాన్నిచ్చే ఎలాంటి రోల్స్‌నైనా చేయడం తనకిష్టమేనంటోంది దిశా.

◆దిశా అభిమానుల్లో చిన్నారులెక్కువ. బబ్లీగా ఉండటం వల్లో లేదా టీవీ ప్రకటనల రూపంలో ఆమె రోజూ వారికి కనిపించి బాగా పరిచయమ వడం వల్లో పిల్లలు ఆమెను ఎక్కువ ఇష్టపడతారు.

◆జాకీచాన్‌కు దిశా హిందీ పాట నేర్పిస్తే... ఆయన చైనా పాటను పాడించే ప్రయత్నం చేశాడట.

◆హాలీవుడ్ హీరో టామ్ క్రూజ్‌తో ఓ సినిమా చేయాలనేది కలట. అయితే సినిమాల్లో పెద్ద స్టార్ అయిపోవాలనే లేదట. కెరీర్‌ను, జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ నటనను ఆస్వాదిస్తానని ఓ సందర్భంలో చెప్పింది.

◆అవెంజర్స్, బర్ఫీలు ఆమె ఇష్టమైన చిత్రాలు. రణ్‌బీర్ ఫేవరెట్ స్టార్. ఆకాశం హద్దు కాదనేది ఇష్టమైన మాట.

◆ఆత్మగౌరవం, స్వతంత్ర భావాలకు పెద్ద పీట వేసే దిశా సంతృప్తి చెందేది స్త్రీ సాధికార కార్యక్రమాల్లో పనిచేస్తేనేనట.

నవ్వుల్ - పువ్వుల్

పరిశీలన

భార్య: ఏమండీ..! మీరు తెచ్చిన అగ్గిపెట్టెలో ఒక్క పుల్లకూడా వెలగట్లేదండీ...

భర్త: అన్నీ పరీక్షించే తెచ్చానే...!!

గజిబిజి

వెంగళప్ప : ఈ మందుల చీటీలో పైన రాసిన మందు ఎక్కడా దొరకట్లేదు డాక్టర్...

డాక్టర్ : అది మందు కాదయ్యా నీ పేరు...!

ఏ కవి

టీచర్ : చింటు ఈ వేమన శతకాన్ని రాసిన కవి ఎవరో చెప్పు?

చింటు : కొంచెం క్లూ ఇవ్వండి టీచర్.

టీచర్ : నా ప్రశ్నలోనే ఆ పేరుంది

చింటు : శతక 'కవి' టీచర్.

భరోసా

డాక్టర్ : ఏం ఫర్వాలేదు రావుగారు.... ఆపరేషన్ తర్వాత నడుచుకుంటూ ఇంటికెళ్లవచ్చు....

రావు : అంటే ఆటోలో వెళ్లడానికి కూడా డబ్బులు మిగలవా.....!!

పెద్దల మాట

చింటు: నిదానమే ప్రధానం అని పెద్దలు ఎందుకంటారు?

బంటి: వాళ్లు వేగంగా నడవలేరు కాబట్టి...

కిసుక్కు

టీచర్: చంద్ర మండలంపై తొలిసారిగా కాలు మోపిందెవరు..?

వెంగళప్ప: ఆ మండలం ఏ జిల్లాలో వుంది టీచర్...??

కిసుక్కు చిత్రం

నాకు నచ్చిన కార్టూన్



ఇల్లస్ట్రేటర్- మార్కో మెల్‌గ్రాటి (క్రెడిట్స్)

సేకరణ - ఆర్.లక్ష్మణరావు, విజయనగరం



కథకురాలిగా మోటూరు ఉదయం, వంతలుగా చింతల కోటేశ్వరమ్మ మహంకాళి పార్వతి దళం

వినరా సోదర.. వీర కుమారా...

ఓ సమూహాన్ని కదిలించేలా కథ చెప్పాలంటే బుర్రకథే. సంగీతం సాహిత్యం, నృత్యం, వాద్యం, శిల్పం, తాళం, లయ, అభినయం, ఆహార్యం వంటి హంగులన్నీ దండిగా ఉండే తెలుగువాడి నిండు కళారూపం, చైతన్యపరిచే జానపదమిది. వీర రసంతో ఉద్రేకపరచి, కరుణ రసంతో కన్నీరు పెట్టించే ఈ అద్భుత కళలో నవరసాలు ఒలికించవచ్చు. కానీ దీని ఉద్దేశం వేరు... అది రాజకీయ, సామాజిక చైతన్యానికి ప్రజల్ని ముందడుగు వేయించేందుకే పుట్టింది. జంగం కథలోని ఉత్తేజకర, ఉద్రేకమైన ఫణితుల్ని... యుద్ధ చప్పుళ్లని చేసే ఢక్కీల చరుపుల్ని తీసుకుని వీరుల కథలను, త్యాగమయుల వృత్తాంతాల్ని నేటి సమాజానికి అన్వయించి 'వినరా సోదర... వీర కుమారా' అంటూ ప్రజల్ని మేల్కొలిపిన ఉత్తమ జానపద సంగీత కళారూపం బుర్ర కథ గురించి ఈ వారం అట్ట మీది కథ.

- కె. శాంతారావు
9959745723
- అజయ్ కుమార్ వారాల
9502395077

పల్నాటి యుద్ధం కథలో ఓ కీలక ఘట్టం. రౌద్ర రసానికి పరాకాష్ఠ.. పతాక సన్నివేశంలో.. పళ్లు పటపటలాడిస్తూ కథకుడు ప్రేక్షకుల్ని రంగ స్థలంలోంచి కదన రంగంలోకి ఒక్కసారిగా లాక్కెళ్లిపోతాడు. అప్పటికే నరాలు తెగేంత ఉత్కంఠ... రోమాలు నిక్కబొడుచుకునేంత ఉద్వేగం... ఓ ఊరు ఊరంతటి జనంలో బద్దలవబోతోన్న ఆ స్థితిని ఎటు చేర్చాలి? ఎలా చేర్చాలి? ఆ స్థితికి తీసుకొచ్చిందెందుకు? దీని వల్ల ఏమవుతుంది? ఆ ఉద్విగ్న స్థితిని ప్రస్తుత రాజకీయంలోకి నెడితే పెద్దల వ్యవహారాలు జనానికి బోధ పడతాయి. ఊరి సమస్యకు కారణాలు బుర్రకెక్కుతాయి. ఉద్యమాలు బయలుదేరుతాయి. చివరగా ఊరు, ప్రాంతం, రాష్ట్రం, దేశం బాగుపడుతుంది. ఆవేశానికి ఆలోచన జోడించే ఏదన్నా జానపదం ఉందా అంటే బుర్ర కథ ముందు మెదులుతుంది. చరిత్ర కథలకు, నేటి సామాజిక పరిస్థితులకు లంకె వేసి భారీ రాజకీయ కుట్రల్ని తేలిగ్గా విడమరిచి ముసుగులూడదీసి చెప్పే తీరు దీని ప్రత్యేకత. అందుకే ప్రజల్లో ఆలోచన కలిగించేందుకు, ఉద్యమకారులకు ప్రేరణ కలిగించేందుకు, యువతకు స్ఫూర్తి రగిలించేందుకు ఈ కళను సాధనంగా చేసుకున్నాయి బుర్ర కథ దళాలు. కథకుడు, ఇద్దరు వంతలు తంబుర, ఢక్కీలతో ఓ సమూహాన్ని కదిలించే ఘటనల్ని ఇప్పటికీ ఓ తరం కథలుగా చెప్పుకుంటుంది. బుర్ర కథలు చూస్తున్న గర్భిణులకు తేలిక ప్రసవాల అయిన విషయాలు, వీర రసానికి ఊగిపోయిన యువకులు గురించి చెబుతుంటే అంత శక్తి ఈ జానపద కళకుందా అని ఆశ్చర్యపోయే ఈ తరానికి బుర్ర కథ దాదాపు కనుమరుగైనదే. ఓ ప్రదర్శనను రేయింబవళ్లూ రోజులకు రోజులు చూశారనేది ఓ అతిశయమే. నవరసాల్ని ఒక్కపాటున పలికే రగడల్ని వినే అవకాశం పోగొట్టుకుంటున్నారనేది ఎందరికి తెలుసు. ఎందుకంటే బుర్ర కథ తీరు మారిపోయింది. బూతు కథలతో... జుగుప్సాకర సంభాషణలతో కాసులకు కక్కుర్తి పడతున్న నేటి కథాగమనం దారి తప్పి ఏళ్లు గడుస్తున్నాయి. ప్రదర్శనలిప్పించే వారిని భజన చేస్తూ నాలుగు రాళ్లు సంపాదించుకునే బృందాలు తయారై రోజులు దొర్లిపోతున్నాయి. తంబుర, ఢక్కీల వాద్యం

కదం తొక్కిన కథాగానం

బుర్రకథను వస్తు శిల్పాలతో ఎప్పటికప్పుడు నాణ్యతను నవ్యతను జోడించి రాగరంజిత ప్రతిభతో వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మేరునగధీర కళాకారుడు పద్మశ్రీ నాజర్. బుర్రకథ పితామహునిగా గణతికెక్కాడు. నాజర్ బుర్రకథ ప్రదర్శనలను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుండి ప్రజలు బండ్లు కట్టుకుని తండోపతండాలుగా తరలి వచ్చేవారు. రౌద్రకరుణర సార్ద్రతాభినయ విన్యాసాలను కళ్ళారా తిలకిస్తూనే నిండు గర్భిణీ స్త్రీలు సుఖ:ప్రసవం అయ్యేవారని కథలు కథలుగా చెప్పుకొనేవారు. ఆ విధంగా కథాగానాల్లో బుర్రకథను శిఖరాయమానం చేశాడు నాజర్. నాజర్ శ్రీకాకుళం పర్యటించినపుడు శ్రోతలు బొబ్బిలి యుద్ధం కథ కోరారు. దీన్ని తానే సొంతంగా కథారచన చేశారు. అల్లూరి సీతారామరాజు, పల్నాటి యుద్ధం, బెంగాల్ కరువు కథల్ని రక్తిగా కళ్లకు కట్టారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఆయన కథాప్రస్థానం సాగింది. 1986లో ఆయన్ను పద్మశ్రీ అవార్డు వరించింది. అట్టడుగు వర్గం నుండి పుట్టే సాధకబాధలు అనుభవించిన నాజర్, అదే అట్టడుగు వర్గపు ప్రజాసాహిత్యానికి పట్టం గట్టిన తీరును గమనిస్తే ఆశ్చర్యం చెందకమానం.

'వందనం వందనం జై భారతమాతా
వందనం
జై భారతమాతా వందనం.
ఓ వీర యోధుడా ఓ ఆంధ్రయోధుడా
లేవయ్యా లేచి రావయ్యా.
బంగారు నీ తెలుగు తల్లి భళిభళి
పాడిపంటల పాలవెల్లి భళిభళి.

ఇలా ఏ రగడ పట్టుకుంటే అది. ఆత్మీయంగా మల్లెతీగలా మనసంతా అల్లుకుపోయేది.

ఏటికి యాతం పట్టె ఐదు పుట్లు పండించినా
ఎన్నడూ మెతుగెరగకున్నా..!
ఎన్నాళ్లో కాపురాలు
ఏ చెరోసిరో పడి చేద్దామన్నా..!

మొదలగు పాటలు నాజర్ గళం నుండి జాలు వారుతుంటే, ఆ తరంగ ధ్వనుల్లో పేదలు తమ అంతరంగాలను దర్శించుకునేవారు. ప్రజానీకంలో ఓ సజీవకళ మమేకం అంటే ఇదే కదా!!

పల్నాటియుద్ధం, బొబ్బిలియుద్ధం, సీతారామరాజు వంటి వీరగాథలేగాదు కష్టజీవి, కరువు వంటి సాదాసీదా కథలు కూడా అసాధారణంగా ప్రతిధ్వనించేవి. కారణం వంతల తూకంతో సమకాలీన సామాజిక, రాజకీయాంశాలను జత కట్టేవాడు. అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయాన్నే ఓ వంతగా మార్చడం బహుశా ఏ కథాగానంలోనూ ఉండకపోవచ్చు. అసలైన వర్గ రాజకీయ చైతన్యమే అంతిమ విముక్తి చైతన్యం.

ప్రజలు ముఖ్యంగా శ్రమ జీవుల జీవితాలు బాగుపడాలని శ్వాసిస్తూ, దీక్షగా గానం చేయడం, ప్రజల్ని కళాత్మకంగా కదలించడం ఉద్యమాలవైపు కర్తవ్యోన్ముఖులను గావించడం ప్రజాకళాకారుల విధి. నాజర్ ఆ విధంగానే చేశాడు. ఓ నిరంతర శోధన, కఠోర పరిశ్రమ, సాధన ద్వారా బుర్రకథను సుసంపన్నం చేయడం తెలుగు వారందరికి గర్వకారణం. ఆ విధంగా ఎందరో బుర్రకథ కళాకారులే కాక ఇతర అనేకమంది ప్రజా కళాకారులకు మార్గదర్శకుడయ్యాడు నాజర్.

మింగేస్తూ హార్మోనియం, మృదంగం, డోలు వంటి అనేక వాద్యాలు కలగలపి దాని విలక్షణతను దెబ్బతీసే ప్రయోగాలు పెరిగిపోయాయి. కానీ రాజకీయం, సామాజికం ప్రాణం పోసుకుని ఉద్యమానికి ఊపిరినిచ్చిన బుర్రకథ దళాల కథ వేరు. ఆ కథకుల నేపథ్యం వేరు. వంతల స్ఫూర్తి వేరు. అంతకు ముందూ బుర్ర కథకు చరిత్ర ఉంది. ఆ తర్వాత ఇప్పుడు కాలం గడుస్తోంది. కానీ నిన్ను, నన్నూ సమాజాన్ని అభ్యుదయం వైపు ఉరకలేయించిన ప్రభావం బుర్ర కథల దళాలిది. వినాయక చవితి, దసరా వంటి పండుగల్లో వికాసం గీతం పాడించిన చైతన్యం వాటిది. లోకరంజకం అనే మాటతో సామాన్యుని పట్టం కట్టించుకున్న జానపదమది.

ఇదీ బుర్ర కథ

మనకు ఉన్న అచ్చమైన జానపద కళారూపాల్లో బుర్ర కథ ఒకటి. ప్రబోధానికి, ప్రచారానికీ సాధనమిది. బుర్ర ఆకారంలో ఉన్న తంబుర వాయిద్యం వల్ల దీనికి పేరొచ్చిందో... లేదా ఆలోచన కలిగించే కళారూపం కావడం వల్ల ఆ పేరు పెట్టారో తెలీదు కానీ సరికొత్త జానపదంగా రూపొందింది. యక్షగాన ప్రక్రియలైన జంగం కథ, శారద కథలకు రూపాంతరమే ఇది. సంగీతం

నృత్యం, నాటకాన్ని సమన్వయిస్తూ రగడలతో నవరసాల్ని పలికిస్తూ పిల్లల నుంచి పెద్దల వరకు అందర్నీ ఆకట్టుకునే రీతిలో అభివృద్ధి జరిగింది. వీరుల, త్యాగధనుల కథలనే ఇతివృత్తాలు చేసుకుని వాటికి నేటి సామాజికాన్ని, రాజకీయాన్ని అన్వయించే క్రమంలో ఈ ప్రక్రియలో వీర, కరుణ రసాలు బాగా ఒప్పాయి. 1940 దశకం నుండి ఇది ఆధునికతను సంతరించుకుని ఆంధ్ర దేశమంతటా కొన్ని దశాబ్దాలపాటు ప్రజానీకాన్ని ఉర్రూతలూగించింది. అంతకు ముందు కేవలం సాంస్కృతిక సంచార తెగల్లోని కొద్దిమంది జీవనోపాధి కోసం ఓ తంబుర కథగా ప్రాశస్త్యం పొందిన ఈ బుర్రకథ కళారూపం పౌరాణిక, చారిత్రక కథలకు మాత్రమే పరిమితమైంది. ఉదర పోషణార్థం ఈ కళాకారులు గ్రామీణ



ప్రజానీకంలోని కొన్ని సామాజిక తరగతులకు సంబంధించి వారివారి వివాహ, నిర్యాణ కార్యక్రమాల్లోనూ. పండుగలు పబ్బాల్లోనూ, తదితర సాంస్కృతిక వేడుకల్లోనూ భాగస్వామ్యమై ఈ కథాగానాన్ని శ్రావ్యంగా ఆలపించేవారు. సరస్వతీ కటాక్షం ఉన్నదనే భావనతో ఈ కథకులను శారదగాండ్రు అని ప్రజలు పిలిచేవారు. తంబురగాండ్రు, పిచ్చుక గుంటలు(గుమ్మెట్లు)వారు మొదలైన పేర్లు కూడా ఉండేవి. తంబుర వాద్యం ప్రధాన కథకుని భుజంపై ఉండేది. ఒక చేత్తో తంబుర వాయిస్తూనే మరో చేత్తో చిటికెల రూపంలో ఉండే వాద్యం(అంజా) వాయించేవారు. ఇరుపక్కల నుండే జోడువంతలు గుమ్మెట్లు వాయిస్తారు. ఆ గుమ్మెట్లనే బుర్రలు, ఢక్కీలు అని కూడా పిలుస్తారు. ఖాళీగా ఉన్న సమయాల్లో, పంటలు ఇంటికి వచ్చిన సమయాల్లో వీరు ఇంటింటా తిరుగుతూ యాచన చేసుకుని బతుకుతారు. అది తమ బతుకుదెరువుగా, సాంస్కృతిక వృత్తి గౌరవంగా వారు భావిస్తారు.

కథాగానం మనకు ఈనాటిది గాదు. అతి ప్రాచీనమైనది. మనిషి తన తీవ్రమైన భావోద్వేగాలు, సామూహికంగా వెలిబుచ్చుకునే క్రమంలో ఈ కథాగానం ఆవిర్భవించింది. మానవ పరిణామ క్రమంలో ఇదో సాంస్కృతికపరమైన అపూర్వ ఘట్టం. సమిష్టి క్రతువులన్నీ ఈ విధంగానే పరిఢవిల్లుతూ జానపదకళలకు జీవం పోశాయి. 'కెథోరిసెస్' (ప్రక్షాళన) పద్ధతి ద్వారా గ్రీకు నాటకాలు ఆవిర్భవించాయని చరిత్ర చెప్తున్నది. ఆసువుగా పాడుకునే ఆ బృందగానాల ద్వారా 'కోరస్' వచ్చింది. ఆ క్రమానుగతం కవులకు, గాయకులకు, కవిగాయకులైన వాగ్గేయకారులకు జన్మనిచ్చింది. కథాగానంలో కథకులు ప్రధానంగా వాగ్గేయకారులై ఉంటారు. ఈ నేపథ్యంలో బుర్రకథను పరిశీలించినపుడు కథకునికి పాట, ఆట(నృత్యం)తో పాటు అభినయం తోడైంది. అభినయం అంటే నాట్యం నాటకం. ఆకర్షణీయమైన చతుర్విధ అభినయాలు (ఆంగికం, వాచికం, ఆహార్యం, సాత్వికం)తోడై కథ రసవత్త రంగా సాగేందుకు ఉపకరించాయి. వెరసి ముగ్గురే ముగ్గురు వ్యక్తుల కలయికతో ఓ అద్భుతమైన సమాహార కళగా బుర్రకథ అవతరించింది.

అభినయం ఎప్పుడైతే చేరిందో యక్షగాన, వీధినాటకం, వీధి భాగోతం దరువులు, చిందులు, రగడలు జతకూడి, నవరసభరితమై శ్రోతలను దృశ్యమాధ్యమంలోకి లాగి, సమ్మోహిత ప్రేక్షకుల స్థాయికి చేర్చింది. బుర్రకథ, వాఙ్మయం, సంగీతం, అభినయం కలగలిసిన త్రివేణి సంగమమై ఓ రసరమ్యమైన ప్రాదర్శనా మనోజ్ఞ కార్యంగా అవతరించిందన్న సత్యాన్ని మనం మరువరాదు.

ఈ నేపథ్యంలో 1943లో ఏర్పడిన ఇప్టా (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్)కళల దృక్పథాన్ని మార్చి వేసింది. కళ కళ కోసం కాదు. కాసుల కోసం కాదు. ప్రజల కోసం అనే నినాదాన్ని ముందుకు తీసుకు వచ్చింది. మార్క్సిజం వెలుగుల్లో కళారూపాల శక్తిని ఇనుమడింపజేసి ప్రజాఉద్యమాలలో వాటిని పాదుకొల్పింది.

'కళ ప్రజలది ప్రజల నుండి ప్రజలకు' అన్న సూక్తిని అర్థం చేసుకున్నట్లయితే మార్క్సిజం నూతన సృజనశీలతకు తెరదీసి వస్తువుతో పాటు రూపాన్ని కూడా ప్రజాపరం చేసిన తీరును గమనించవచ్చు.

ప్రజాకళా తపస్వి డా.గరికపాటి రాజారావు ఆ విధంగా మన తెలుగునాట ఎన్నో జానపద కళారూపాలను ప్రజా కళారూపాలుగా మలిచారు. ప్రజా కళాకారులు వస్తువుతోపాటు రూపాన్ని అధ్య యనం చేయవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

ఉత్తరాంధ్రలో బాగా ప్రాచుర్యం పొందిన బుర్ర కథ కళాకారుల్లో కుమ్మరి మాస్టార్ ముందుంటారు. దారా అప్పల నారాయణ ఆయన అసలు పేరు. అధ్యాపకునిగా చేసిన కుమ్మరి మాస్టర్ ఆ తర్వాత బుర్ర కథకు అంకితమయ్యారు. రొంగాలి సత్యనారాయణ మూర్తి, కుమారి జానకి వంతలుగా ఆయన ప్రదర్శనలిచ్చేవారు. 1950-1992ల మధ్య తెలుగు ప్రాంతమంతటా అనేక ప్రదర్శనలిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళాప్రపూర్ణ బిరుదును పొందారు.

దళం గళంలో...

బుర్రకథ ప్రార్థనతో మొదలవుతుంది. భారత దేశం మంచి చెడ్డ గురించి అందులో పాడతారు. ఆ తర్వాత దేవ గాంధారి రాగమందుకుని చెప్పే కథను పరిచయం చేస్తారు. వంతల సాయంతో 'వినరా సోదర.. వీర కుమారా...'తో కథకుడు ఒక్కో సందర్భాన్ని, ఒక్కో ఘట్టాన్ని, ఒక్కో రసాన్ని ప్రేక్షకుడి కళ్లకు కడతారు. ఢక్కీలు, తంబురాల్ని సరైన సమయంలో వాయించి మరింత నేపథ్యాన్ని ఆవిష్కరిస్తారు. మధ్య మధ్యలో 'తానే తందానా...' 'తకిట తకిత తా...'లతో కథాగమనానికి ఊకం వేస్తుంటారు. శాస్త్రీయ గీతాల్లో పల్లవి చరణాల్లాంటి రగడలు బుర్ర కథకు ప్రత్యేకం... అదనపు ఆకర్షణ. ప్రధాన కథ మధ్యలో పాటలుంటాయి. అవి నేటి సమాజాన్ని, రాజకీయాన్ని వివరిస్తాయి. వాటిల్లో 'లెమ్ము సోదరా.. విజయమ్ము నీదిరా...', 'ఎన్నాళ్లీ కాపురాలు.... ఎట్లాగి కాపురాలు...' వంటివి ఎంతో ఆదరణ పొందాయి. తెలుగు నేలపై బుర్ర కథ దళం గళం బాగా వినిపించిన కాలంలో సుమారు 500పైనే కథకులుండేవాళ్లు. కృష్ణా, ఖమ్మం వంటి జిల్లాల్లో పదుల కొద్దీ బుర్ర కథ దళాలుండేవి. బుర్ర కథ దళం పక్కూరిలో ప్రదర్శనిస్తోందని తెలిస్తే బళ్లు కట్టుకుని వచ్చి చుట్టూ ఉన్న పది ఊళ్లు కూర్చుండిపోయేవి. ఒకే కథను పదిమార్లు చెప్పించుకుని రోజులు రోజులు చూసే జనం ఉండేవారు. పార్టీలకతీతంగా పండుగలప్పుడు ప్రజలు బుర్ర కథ దళాల ప్రదర్శన వేయించుకునేంత ప్రభావం వాటిది. బుర్ర కథ దళం గళంలో స్థానిక సమస్యలు మరింత బిగ్గరగా మరింత సూటిగా మరింత తీవ్రంగా రాజకీయ పెద్దలకు చేరేవి. నోరిప్పి చెప్పుకోలేని ఊరి సమస్యకు వాణి అయ్యి జనం మాటగా వెళ్లేవి. అప్పటి వరకూ నానుతూ వస్తున్న ఆ సమస్యలు ప్రదర్శన అయిపోయాక పరిష్కారం కోసం ఉద్యమం బాటకు మరలేవి. ఈ చైతన్యాన్ని చూసే వీటిని అడ్డుకునే ప్రయత్నాలు జరిగేవి. బుర్ర కథ దళాల ప్రదర్శనకు అన్నీ రకాల ఆటంకాలుండేవి.

మహిళా బుర్రకథ దళం

1940ల్లో ఫాసిస్ట్ వ్యతిరేక ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆ రోజుల్లో జానపద, బుర్ర కథల ద్వారా ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రచారం పెద్ద ఎత్తున సాగించారు. మొదటిగా ఏర్పడిన రాజకీయ బుర్ర కథ దళంలో ప్రధాన కథకురాలిగా మోటూరు ఉదయం, వంతలుగా చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి పార్వతి గుంటూరు జిల్లాలో ప్రచారం చేసేవారు. అలాగే మహిళా చైతన్యం కోసం కథల్ని ఉపయోగించేవారు. అప్పటి సమాజంలో స్త్రీ అంటే చాలా తక్కువ భావన ఉండేది. ఈ దళం ఆవిర్భావం ఆ దృష్టిని విసిరికొట్టింది. బాల నాగమ్మ, రుద్రమ దేవి వంటి స్త్రీ శక్తుల స్ఫూర్తి ఆనాటి మహిళా సమాజానికి తెలిసేలా చేశారు. వీరి ద్వారా ప్రేరణ పొంది ఉద్యమంలోకి వచ్చిన చాలామంది మహిళలు జానపద కళాకారులుగా సేవలందించారు.

స్వాతంత్ర్య పోరాట కాలంలో వీటిని ప్రెసిడెన్సీలు నిషేధించాయి. బుర్ర కథ మాటెత్తితే... అరెస్టులు జరిగిపోయేవి. దేశాన్ని బ్రిటీష్ పాలకుల సంకెళ్ల నుంచి విడగొట్టేందుకు ప్రజా నాట్య మండలి ఎంచుకున్న జాన పద కళల్లో బుర్ర కథకు ఊహించనంత స్పందన వచ్చింది. అది విని ఊళ్లకు ఊళ్లు స్వాతంత్ర్య పోరాటానికి కదిలేవి. అందుకే కథకులనే టార్గెట్ చేసుకుని తెల్ల దొరలు, పోలీసులు నిఘా ఉంచేవారు. వీరి కనుగప్పి అర్ధరాత్రుళ్లు ప్రదర్శనలిస్తే నిద్రను కూడా కాదనుకుని ప్రజలు పోగయ్యేవారు. 1920-21 నుంచే జానపద కళల్ని సాధనంగా చేసుకుని ప్రజా బాహుళ్యంలోకి స్వేచ్ఛా పోరాటాల్ని తీసుకెళితే 1940ల్లో ప్రజా నాట్య మండలి బుర్ర కథకు కొత్త ఊపిరినిచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా బుర్రకథ దళాలు స్థానిక సమస్యల పరిష్కారానికి, కుట్ర రాజకీయాలకు వ్యతిరేకంగా పనిచేశాయి. నాజర్ దళం, ఉదయం దళం, కాజా దళం వంటివి ఒక్కో కాలంలో ఒక్కోటి బుర్రకథను బతికించుకుంటూ వచ్చాయి. గొడవల్ని, దాడుల్ని తట్టుకుని అనేక దళాలు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించేవి. తొలితరం బుర్రకథకులు కాకుమాను సుబ్బారావు, చింతపల్లి సూర్యనారాయణ, నాజరూ, రామకోటి, గోపాలం, రాజు, లక్ష్మీకాంత మోహన్‌లు. నాజరూ తన ప్రత్యేక శైలితో ఈ కళను జనాల్లోకి తీసుకెళ్లాడు. అందుకే ఆయనకు బుర్రకథా పితామహుడనే పేరొచ్చింది. పద్మశ్రీ అవార్డు దక్కింది.

"కళ కళ కోసం కాదు. ప్రజల కోసం అన్న సూక్తి గొప్పది. అన్ని కళలూ విప్లవ చైతన్యమివ్వడానికి తోడ్పడేవిగా ఉండాలి. పుట్టి పెరిగిన వాతావరణాన్ని బట్టి భిన్న అభిరుచులూ అభివృద్ధి చెందుతాయి. అలాగే విప్లవాశయాన్ని బట్టి అవసరాన్ని బట్టి కళాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుంది. అలా అని కళనూ కవిత్వాన్నీ ఉపన్యాస ఫక్కీకి, నినాదాల సరళికి దించితే అది అనుకున్న ఆకర్షణను కలిగించనూలేదు, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయలేదు. విప్లవాశయాన్ని కళారూపానికి, కవిత్వ కల్పనకూ సమన్వయం చేసినపుడే ధ్యేయం నెరవేరుతుంది. ఆశయానికి కట్టుబడకపోతే కళాకారులు కూడా బతుకుదెరువు మార్గానికి తమ నైపుణ్యాన్ని మలుచుకుంటారు. అలాగే పెడ ధోరణులు పట్టిన వారు కళనూ పెడమార్గం పట్టిస్తారు. పెడధోరణులు పట్టిన వారు ప్రజా కళాకారులుగా కొనసాగడం కష్టం. అరాచక ప్రవర్తనలు, యీర్ష్యలు, క్రమశిక్షణా రాహిత్యం అత్యంత హానికరం. ఇది నా అనుభవంలో కలిగిన గుణపాఠం.' అన్న మోటూరు హనుమంతరావు మాటలు బుర్ర కథ ప్రస్తుత పరిస్థితికి వర్తిస్తాయి. టీవీల్లో కామెడీ షోలకు, సినిమాల్లో సంకుచిత సీన్లకు, జాతరల్లో బూతు ప్రదర్శనలకు, ప్రభువుల భజనలకు దిగజార్చేసిన బుర్రకథ తీరు మారితే ఆ జానపదం మళ్లీ వర్ధిల్లుతుంది. నేటి పరుగుల కాలానికి ఉరుకుల తరం పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రదర్శన నిడివిని తగ్గిస్తే పునరుజ్జీవనం సాధ్యమే. అప్పుడు వివిధ దృశ్యమాధ్యమాల్లోను చోటు దక్కుతుంది. అడుగూ... అరుపూ... కంఠం... నాదం... చేయీ కాలూ... రగడ, చెణుకు ఇలా హావభావాల నుంచి ఆలాపన వరకూ సమన్వయముండే కథకుడు, వంతలు తయారైతే వై, జెడ్ జనరేషన్లు కూడా ఉత్కంఠగా ప్రదర్శనలకు బళ్లు వేసుకొస్తారు. కథకుడి కథ ఆగకూడదు. ✦

ప్రముఖులు

షేక్ నాజర్, కుమ్మరి మాస్టారుగా ప్రఖ్యాతి చెందిన దార అప్పలనారాయణ, పెండ్యాల వెంకటేశ్వరరావు, పరుచూరి రామకోటయ్య, సిరివిశెట్టి సుబ్బారావు, ప్రమీల సిస్టర్స్, కోసూరి పున్నయ్య, గోవర్ధన, కాకుమాను సుబ్బారావు, దావులూరు, చింతల సూర్యనారాయణ, మోటూరి ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మీ తదితర కళాకారుల పేర్లు బుర్రకథలకు పర్యాయపదాలుగా మారాయి. ప్రమీల సిస్టర్స్ బుర్రకథ చెప్పడంలో అందెవేసిన కళాకారులు. కన్యక, చెల్లి చంద్రమ్మ, అల్లూరి సీతారామరాజు, బొబ్బిలి యుద్ధం, పల్నాటి చరిత్ర కథలను రసవత్తరంగా ప్రదర్శిస్తారు. వీరు ఆకాశవాణి, దూరదర్శన్‌లో అనేక ప్రదర్శనలను ఇచ్చారు.

కాజా దళం

దివి తాలూకా కాజా బుర్ర కథ దళం కథకుడు జగన్. ఆయన వంతలు రంగనాయకులు, నాగిరెడ్డి. వీరి బుర్రకథ దళం ఏర్పడటానికి కారణం ఆ జానపద కళ ప్రభావమే. చిన్నప్పుడు ఊళ్లో బుర్ర కథను ప్రాక్టీస్ చేసే ఓ దళాన్ని చాలా దగ్గరగా చూసే అవకాశం దక్కింది జగన్‌కు. తండ్రి తులసీదాస్ అదే నేపథ్యం కావడంతో జగన్‌ను ప్రోత్సహించారు. రగడల్ని బాగా ప్రాక్టీస్ చేయించి వినేవారు. డబ్బాలిచ్చి వాటినే ఢక్కీలుగా భావించి ప్రదర్శనలా ఇవ్వమనేవారు. వీరి ముగ్గురిని తీసుకెళ్లి బుర్రకథ దళంతో ఓ నెల రోజులు శిక్షణ ఇప్పించారు. అప్పటికి వాళ్లకి 12 ఏళ్లుంటాయి. అల్లూరి సీతారామరాజు కథ చెప్పడంలో బాగా ప్రతిభ చూపడంతో 1961లో ఓసారి ఊరిలో పిల్లలమర్రి వెంకటేశ్వర్లు మీటింగ్‌కు వీరితోనే శిక్షణనిప్పించారు. జగన్ మేనమామ కృష్ణ బుర్రకథ కథకుడిగా ఉండేవాడు. అరెస్టుల భయంతో చాలామంది కథకులు కాజా బుర్రకథ దళంలో మారిపోయారు. చిన్న వయస్సైనా జగన్‌నే కథకుడిగా ఎంచుకుని ప్రదర్శనలిప్పించారు. అలా నాలుగైదు వేల ప్రదర్శనల్ని ఇచ్చింది కాజా బుర్రకథ దళం. కృష్ణాలోనే కాక ఖమ్మం, నల్లగొండ, గుంటూరు వంటి ప్రాంతాల్లో వీరికి వేలాది మంది అభిమానులుండేవాళ్లు. బళ్లు కట్టించుకొచ్చి మరీ వేరే ప్రాంతంలో జరిగే ప్రదర్శనలు చూసేవారు. అల్లూరి సీతారామరాజు కథతోపాటు పల్నాటి యుద్ధం, రుద్రమ దేవి కథ, సుందరయ్య గారి కథలను చెప్పేవారు. సుమారు పదిహేను కథలుండేవి. 1990 నాటికి వీరి దళం ప్రదర్శనలు ఆగిపోయాయి. వంతలు ఐదారేళ్ల క్రితం చనిపోతే కథకుడు జగన్ తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం బాధ్యతల్లో మునిగిపోయారు. రాజకీయంగా బుర్ర కథ చెప్పేవాళ్లలో చివరి తరం వీరిది. వీరోసారి ఖమ్మం జిల్లాలో బాలనాగమ్మ ప్రదర్శనిచ్చినపుడు ఊరిలో ఓ భూస్వామి కొన్ని వేల రూపాయల ప్రజల డబ్బును మింగేసిన విషయం తెలిసింది. ఆ విషయాన్ని కథలోని కోడి పందేలాట సందర్భాన్ని ఆసరా చేసుకుని చెప్పేసరికి ఆ పెద్ద మనిషి ఊరివారికి లెక్కలు వివరించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటివెన్నో కథలున్నాయి.

పొడుగాటి



అమెరికా వాళ్లు బాగా ఇష్టపడే బాస్కెట్‌బాల్ ఆటలో ఎక్కువగా పొడుగరులే క్రీడాకారులు. ఈ ఆటలో ఇప్పుడో 16 ఏళ్ల కుర్రాడు చెలరేగిపోతున్నాడు. మెళకువల్లోనే కాదు ఎత్తుతోను. ఆ వయసుకే మనోడు ఏడు అడుగుల ఏడు అంగుళాల ఎత్తున్నాడు. ప్రపంచంలోని బాస్కెట్ బాల్ క్రీడాకారుల్లో



అతి ఎత్తైన వాళ్లలో రెండో స్థానంలో నిలచి బాల్‌ను నెట్‌లోకి తోసేస్తున్నాడు. మొదటి స్థానంలో ఉంది ఇంగ్లండ్ క్రీడాకారుడు 29 ఏళ్ల పాల్ స్టర్‌గెస్. ఓహియోలోని జెనీవాలో ఉన్న స్పైర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రాబర్ట్ బాబ్రోక్జీ ఎన్బీయేలో ఆడే ఎత్తైన క్రీడాకారునిగాను గుర్తింపు పొందాడు. మనోడి సొంత దేశం రొమేనియా. 12 ఏళ్లకే ఎత్తులో 7 అడుగుల్ని టచ్ చేశాడు. త్వరలో 8 అడుగులు దాటేస్తాడని అనుకుంటున్నారు. ఇలా అయితే కనుక ఆ మార్క్ దాటి ఎదిగిపోయిన 18వ వాడిగా మరో రికార్డు సృష్టిస్తాడు. రాబర్ట్ తండ్రి కూడా బాస్కెట్ బాల్ క్రీడాకారుడే. రొమేనియాకు ఆడే ఆయన ఎత్తు 7 అడుగుల ఒక్క అంగుళం. రాబర్ట్ గురించి తెలుసుకుని ఎన్బీయే వాళ్లు తమతో ఆడమని అడగడంతో ఆయన ఒకడుగు గర్వం ఎక్కువే పడ్డాడు.. ఎత్తులోనే కాదు అవకాశాల్లోను కొడుకు ఎత్తుకు ఎదిగిపోయాడని. కాలేజీ పిల్లలతో మనోడు ఆడుతుంటే అవతార్ చిత్రంలోని పండోరా వాసిలా కనిపిస్తున్నాడని తల్లి మురిసిపోతోంది.

వింత లోకం

ముఖం చూపించకుండా...



ఇప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా సెలబ్రెటీలుగా మారిపోతున్న వాళ్లు చాలామందే ఉన్నారు. వీరిలో అమ్మాయిల హవా చాలా ఎక్కువ. సాధారణంగా టీనేజర్లు ఎక్కువగా అడిక్ట్ అయిపోయిన అంతర్జాల లోకంలో ఎంత ఆర్టిస్ట్ అయినా, లేదా అథ్లెట్ అయినా అందెగత్తెలే ఎక్కువగా స్టార్‌లుగా వెలిగిపోతుంటారు. అయితే ఈ అమ్మాయి మాత్రం అలా కాదు ముఖం చూపించకుండానే పెద్ద సెలబ్రెటీ అయిపోయింది. పోలండ్‌లోని వార్సాకు చెందిన 20 ఏళ్ల మామూలు అమ్మాయి నటాలియా గుట్కీవిక్జ్ లక్షమంది ఫాలోవర్లను ఇలానే పెంచేసుకుంది. తనే ఏ పోస్ట్‌లోను ముక్కూ ముఖం చూపించదు. ఏదో దాగుడు మూతల ఆటల కొంచెం కొంచెం కళ్ల తీరును, నవ్వును బయట పెడుతుంది కానీ ప్రతి ఫొటోలోను పూర్తిగా కనిపించదు. ఇలా కూడా పాపులర్ అవ్వొచ్చా అనేవారికి ఆమె దగ్గర ఓ మంచి సమాధానం కూడా ఉంది. చాలా మంది వెర్రి పట్టినట్టు సామాజిక మాధ్యమాల్లో ఒళ్లు దాచుకోకుండా ఫొటోలు పెడుతుం టారట... అలాగే ఓ పోస్ట్ చేసేందుకు ఒకే రకమైన వందల ఫొటోలు దిగి మంచిది వెతుక్కు నేందుకు నానా అవస్థలు పడుతుంటారట... వీరందరికీ భిన్నంగా కేవలం ఆసక్తి రేపేలా ఏ మాత్రం అసభ్యంగా లేకుండా కూడా పాపులర్ అయిపోవచ్చని చెప్పాలని ఇలా చేస్తోందట. అంతకు ముందు తన మిత్రుల కోరిక మేరకు వారి ఫొటోల్ని అందంగా తీసి పోస్ట్ చేసేది. తన ఫొటోలు పెట్టేందుకు మాత్రం సిగ్గు పడేది. ఫొటో క్లిక్‌మనే లోపు ముఖం దాచేసుకునేది. అదే హిట్ లుక్ అయిపోయింది. ఏంటో ఈ కాలం అంతర్జాలం లోకం పిచ్చి. ఒక్కోసారి ఏం అర్థం కాదు.

ట్రంప్ కార్డ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల్ని నిరసించేందుకు బెల్జియంకు చెందిన జీజిచ్ట్ కేఫ్ ఓ ట్రంప్ కార్డ్ వేసింది. అదేంటంటే మెనూ కార్డులో ఒక్క అమెరికన్ ఆహార పదార్థం లేకుండా చేసింది. ట్రంప్‌కు ఇలా వ్యాపారం రూపంలో చెబితేనే నిరసన బాగా అర్థమవుతుందని అలా చేసింది. మొదటి నుంచి డొనాల్డ్ మాట తీరు, వ్యవహార శైలిపై గుర్రుగా ఉన్న కేఫ్ మేనేజర్లు, స్టాఫ్ ఆయన అధ్యక్షుడు కాగానే వేరే జాతుల వారిని, దేశాల వారిని ఇబ్బంది పెడుతూ తీసుకున్న నిర్ణయాలకు కోపం నషాళానికి ఎక్కేసింది. అందుకే అమెరికా వస్తువులను బహిష్కరించేశారు. తమ కస్టమర్లు కూడా ఈ విషయంలో సర్లేమని తలలూపారట. అసలీ నిర్ణయం తీసుకోడానికి ముందు పెద్ద ఆలోచనే చేశారు. అంతకు ముందు పిచ్చాపాటీగా

ట్రంప్ విధానాల గురించి చర్చలు సాగించేవారు. ఆయన విధానాల్ని విమర్శిస్తూనే అమెరికా ఉత్పత్తులను, బ్రాండ్ ఆహారాన్ని కస్టమర్లకు వడ్డించేవారు. ఓ వైపు విమర్శించడమెందుకు మరోవైపు వాటి మీదే ఆధారపడటమెందుకు అని బుర్ర వెలిగిందట. అంతే కొత్త మెనూ కార్డులు అచ్చేయించారు. ఇది కాస్త విపరీతం కదా... ఆయనలా మీరు ప్రవర్తిస్తున్నారు కదా అని ఎవరైనా అంటే ఇంత చిన్న కేఫ్ తీసుకున్న నిర్ణయమే పెద్ద రాద్ధాంతంలా కనిపిస్తే అంత పెద్ద దేశం చేస్తోన్న దాన్ని ఎలా తీసుకోవాలి? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. వీరికి జవాబిచ్చి కేఫ్‌లో అమెరికా కెచప్ ఎప్పుడు తినడం ఇప్పుడిప్పుడే కుదరదు. ఒకవేళ డొనాల్డ్ విధానాలు మంచిగా మార్చుకుంటే లేదా ఆయన పదవిలో నుంచి తప్పుకుంటే, పదవీకాలం ముగిస్తే చూద్దామంటున్నారు. అయితే ఓకే.



రైతు కట్టిన మ్యూజియం

సయ్యద్ ఘనీ ఓ రైతు బిడ్డ. భారతీయ పురాతన చరిత్ర అధ్యయనం దిశగా ఆర్కియాలజీ, మ్యూజియాలజీలో డిగ్రీ పూర్తిచేశాడు. చరిత్రలో మరుగున పడిన భారతీయ ఔన్నత్యాన్ని నేటి తరానికి పరిచయం చేసేందుకు సొంతగా ఒక మ్యూజియాన్ని నడపాలనేది ఆయన ఆశయం. తండ్రి మరణంతో ఆ ఆశయాన్ని పక్కన పెట్టి రైతుగా పొలం పనుల వైపు అడుగేశాడు. ఆ అడుగే ఓ వినూత్న శాస్త్రీయ దృక్పథం వైపు నడిపించింది. వ్యవసాయానికి సాయంగా అగ్రికల్చరల్ సైన్సే ఉండాలా? తన చదువు ఉపయోగపడదా అనే ఆలోచనలో రాత్రింబగళ్లు పరుగులు తీశాయి. అలా ఆ ఆలోచన సేద్యానికి ఆర్కియాలజీ అక్కరకొచ్చే మ్యూజియంగా వెలిసింది. పాత పద్ధతుల్లోని సేంద్రీయ సాగు లాభాలు ఇప్పటి వరి వంగడాల విలువ కలేసి వ్యవసాయ పరిణామ క్రమాన్నీ జతేసి చెప్పే ఈ రైస్ మ్యూజియం వెలకట్టలేనిది.

మ్యూజియం ద్వారా మేలైన సేద్య విధానాలపై అవగాహన కల్పించి నిస్సారమవుతున్న భూమిని, ఊరి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నాడు సయ్యద్ ఘనీ. తను వుపయోగిస్తున్న ధాన్యం రకాలన్నీ ఒకప్పటి కరువు కారణంగా మరుగున పడ్డ ధాన్యం రకాలే. నాలుగేళ్లుగా భారత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 850 సాంప్రదాయక వరి రకాలతో తను ఏర్పాటు చేసిన 'ఘని మ్యూజియం' భారతదేశపు తొలి రైస్ మ్యూజియంగా గుర్తించబడి పురాతన వరి రకాల గురించి దేశవ్యాప్తంగా రైతులు తెలుసుకునేందుకు దోహదపడుతోంది. వీటన్నిటిపై యువ రైతుల్లో అవగాహన పెంచి పర్యావరణ వ్యవస్థని పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నాడు సయ్యద్ ఘనీ.

కర్నాటకలోని మాంధ్యా జిల్లాలో కిరుగవూలు ఓ మారుమూల గ్రామం. టిప్పు సుల్తాన్ ద్వారా స్వయంగా తమ పూర్వీకులు అందుకున్న తియ్యని మామిళ్ల రకం 'బడాబాగ్' సాగులో పేరు గడించింది ఘనీ కుటుంబం. 17వ దశాబ్దం చివరిలో మొదలైన ఆ సాగులో తియ్యని మామిడి రకాలని అందించగలిగింది ఘనీ కుటుంబం. ఆ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారసుడు సయ్యద్ ఘనీ. పూర్వీకుల్లా కాక భారతీయ చరిత్ర అధ్యయనంపై ఆసక్తి పెంచుకున్నాడు. మ్యూజియాలజీలో డిగ్రీ పూర్తి చేసేనాటికి తనకి 22 ఏళ్లు. తండ్రి చనిపోయాక వ్యవసాయం చూసుకోడం మొదలెట్టాడు. ఓ సారి తొలకరి దశని పూర్తిచేసుకున్న వరి పైరు ఏపుగా పెరిగేందుకు క్రిమి సంహారకాల పిచికారీ చేశాడు. ఆ విషపూరిత రసాయనాల కారణంగా స్పృహ తప్పి పడిపోయాడు ఘనీ. పంట పొలాల్లో ఎరువులు, క్రిమిసంహారకాలు వంటి విషపూరిత రసాయనాలని వాడడం ద్వారా భూమి నిస్సారమవ్వడంతోపాటు రైతులు అనారోగ్యానికి గురవుతున్న విషయం అనుభవంలోకి వచ్చింది. ఎప్పుడో సేంద్రీయ సాగు పద్ధతుల గురించి చదివాడు. తన చదువులోను పురాతన పద్ధతులపై అవగాహన ఉంది. ఈ రెంటినీ బాగా అధ్యయనం చేసి నేటి పరిస్థితులకు, నేలసారానికి తగ్గట్టు సేద్యంలో మార్పులు చేయాలని తన పొలాన్నే ఓ ప్రాజెక్ట్‌గా తీసుకున్నాడు. పోషకాల్ని అందించే సాంప్రదాయ వరి రకాల అన్వేషణ మొదలు పెట్టాడు. ఆ పరిశోధనలో భాగంగానే ఒకప్పుడు తమ గ్రామంలో రైతులు సాగు చేసిన రాజ భోగ్, బడా కాడి బడా, దొడ్డి బడా వంటి కరువును తట్టుకునే వరి రకాల గురించి తెలుసుకున్నాడు. కొన్ని దశాబ్దాల క్రితం హైబ్రిడ్ విత్తనాలని ప్రవేశపెట్టాక ఇప్పుడు గ్రామంలో ఈ వరి రకాలన్నీ మరుగున పడ్డాయి. హైబ్రిడ్ విత్తనాలు ఎక్కువ దిగుబడిని అందించినా తెగుళ్ల బారిన పడకుండా సంరక్షించాల్సి ఉంటుంది ఇవి పునరుత్పత్తిని ఇవ్వలేవు. తన పరిశోధనల్లో ఘనీ సేకరించిన ఒక కొత్త రకం వరి విత్తనాలని గ్రామస్తులకి అందించినా ఆ విత్తనాలని వారు గుర్తించలేకపోవడంతో ఒక వ్యవసాయ శాస్త్రవేత్త సాయం తీసుకున్నాడు. ఒకప్పటి స్థానిక వరి రకంగా ధృవీకరించాక వాటితోనే సాగు చేశాడు. నేటి తరం రైతుకి అందకుండా మరుగున పడిన సేంద్రీయ వరి రకాలెన్నో వున్నాయని తెలుసుకున్న ఘనీ మనసులో ఒక కొత్త ఆలోచన మొదలైంది. అది మన దేశంలో తొలి రైస్ మ్యూజియానికి నాంది పలికింది. వివిధ రాష్ట్రాల్లో రైతులు ఉపయోగించిన రాజభోగ్, ఆనంది, జీరిగ సాంబ వంటి ఎన్నో వరి రకాలతోపాటు రాజ్‌ముడి, కేంపు దొడ్డి, బిలినెల్లు, గంధసాలె లాంటి ఎన్నో అరుదైన వరి రకాలను సేకరించి ఈ మ్యూజియంలో భద్రపరిచాడు. రుచి, వాసన, రంగు పరిమాణం, ఆకారాల్లో వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. నాలుగేళ్ల పాటు ఎంతో కష్టపడి వీటిని సేకరించడం వెనుక ఒక గొప్ప కారణం లేకపోలేదు. సహజ సిద్ధంగా పెరిగే ఈ వరి రకాలు తక్కువ నీటితో సాగు చేయవచ్చు. వివిధ వాతావరణ పరిస్థితులకి నిలబడగలవని తెలుసుకున్నాడు. వరదలు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాలని తట్టుకుంటాయని పెద్దలు చెప్పారు. ఇలాంటివి దాదాపు 800 రకాల వరి వంగడాలని మ్యూజియంలో పొందుపరిచాడు. వరి విత్తనాభివృద్ధి సంస్థతోపాటు కొందరు స్థానిక దళారులు ఈ వరి విత్తనాల కోసం తనని ఆశ్రయించినా తిరస్కరించాడు. ఇవి పూర్తిగా స్థానిక పేద రైతులకి చెందాలనేది తన ఆలోచన. సంప్రదాయ వరి రకాల సాగు గురించి తెలుసుకునేందుకు ఎంతోమంది రైతులు, శాస్త్రవేత్తలు ఘనీ వ్యవసాయ మ్యూజియాన్ని సందర్శిస్తున్నారు. ✶





లాహిరి

గు
బి
వెత
సాగే
వి
ఎన్నో



లాహిరి లాహిరి

భారత దేశంలో వీక్షించదగిన అద్భుత ప్రదేశాల్లో కేరళ ఒకటి. దేశ ప్రధాన వ్యవసాయ రాష్ట్రంగా పేరొందిన కేరళలో వరి పైరులు, కొబ్బరి తోటలతోపాటు గ్రామీణ ప్రాంతాలతో ముడిపడిన రకరకాల బాతులు, చేపల పెంపకాలు ఈ పడవ ప్రయాణాల ద్వారా ఆస్వాదించగలగటం ఇక్కడ మాత్రమే సాధ్యపడుతుందని చెప్పొచ్చు. కేరళలోని వివిధ ఆకర్షణీయమైన ప్రాంతాలు, అద్భుతమైన ప్రదేశాలతోపాటు గూటి పడవల ప్రయాణంలో అడుగడుగునా ప్రకృతి అందాలు పర్యాటకులని పలకరిస్తూనే ఉంటాయి. అలెప్పీ బోటు ప్రయాణంలో అవన్నీ కొత్త అనుభూతిని అందిస్తాయి. సెడ్ బే ప్రాంతంలో పురాతన నగరాలు, భారత దేశంలో మధ్య యుగం నాటి చారిత్రిక కట్టడాలకి పేరొందిన ప్రదేశం అలెప్పి భారత్‌లోని భూతల స్వర్గంగా చెప్పబడే అలెప్పిని చూసేందుకు హౌస్ బోట్ ఒక అనువైన ప్రయాణం. కుమారకోమ్ దిశగా వెంబనాడ్ సరస్సులో సాగే ఈ పడవ ప్రయాణం యాత్రికులని గ్రామీణ వాతావరణానికి చేరువచేస్తుంది. కన్నుల పంగుగా సాగే ఈ యాత్రలో ఇరువైపులా పచ్చటి ప్రకృతి దృశ్యాలు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయి. ఇవన్నీ ఆస్వాదించాలంటే మీరూ ఓ బోటు ప్రయాణం చేయాల్సిందే.

కాశ్మీరీ దోంగా

కాశ్మీర్ లోయల్లో ప్రయాణం పర్యాటకులకు అంతులేని ఆనందాన్నిస్తే దాల్ సరస్సులో సాయంత్రాలు సరికొత్త తీరాలని పరిచయం చేస్తాయి. కాశ్మీర్ వేసవి రాజధానిగా పిలువబడే శ్రీనగర్‌లో రెండవ అతి పెద్ద సరస్సు దాల్. 15.5 కి.మీ. విస్తరించి వున్న దాల్ తీరప్రాంతంలో పార్కులు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, స్టార్ హోటళ్లతో పాటు హౌస్ బోట్‌లు అక్కడ ప్రత్యేక ఆకర్షణ. పడవ పూదోటలు, పష్మినా శాలువాలు, కాగితం ఉత్పత్తులు, నిలువెత్తున వేలాడదీసే రంగురంగుల తివాచీలు, రగ్గులుతో కొలువుతీరిన దుకాణాలు యాత్రికుల కోసం అర్ధరాత్రి వరకు తెరవబడి వుంటాయి. ఈ ప్రదేశాలన్నిటిని చుట్టేందుకు అక్కడి షికారాలు అందుబాటులో వుంటే బోట్ హౌస్‌లు కొత్త జంటలకి హనీమూన్ డెస్టినేషన్లుగా మారతాయి బాల్కని, డ్రాయింగ్ రూమ్, డైనింగ్, మూడు పడకగదులు, టాయిలెట్స్‌ని కలిగిండే హౌస్ బోట్‌లో ఒక్క రోజు బసచేయడానికి దాదాపు రెండు వేలు చెల్లించ్చాల్సి వుంటుంది. షికారాలో ఓ రెండు మూడు గంటల షికారుకు ఐదు వందలు వెచ్చిస్తే చాలు. హౌస్ బోట్ల కంటే కాస్త తక్కువ పరిమాణంలో వారసత్వ సంపదలుగా



అండమాన్ దీవుల్లో



వుంటాయి దోంగా పడవలు. వీటి
కాశ్మీరీ సాంప్రదాయ అలంకరణల
సరస్సు మధ్య భాగంలో ఏర్పడిన
రాజకుటుంబీకులకి చెందిన ప్రాం
చెట్ల ద్వారా ఆ పేరు స్థిరపడింది.
ఇక్కడ కాసేపు సేద తీరొచ్చు కా
భాగమైన సూఫీ సంగీతం, జానప
ప్రత్యేక నృత్య ప్రదర్శనలు దోంగా
పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా
వంటకాల తోపాటు సాంప్రదాయ
అందుకోవాలంటే దోంగ్ పడవ ప్ర

పిల్ల కాలువలు, పచ్చని పంట పొలాలు, సరస్సులని దాటుకుంటూ చేసే
ాటి పడవ ప్రయాణాలు కొన్నైతే... వొంపులు తిరిగే నదీ మార్గాల్లో హౌస్
ోట్‌లో విహార యాత్రలు మరికొన్ని... సముద్రం మధ్య వెలసిన ద్వీపాలను
ుక్కుంటూ ఓడలో సాగే ఉత్కంఠభరిత సాహసయాత్రలు మరికొన్ని. నీటిపై
ఈ పడవ ప్రయాణాల్లో పచ్చని ప్రకృతి దృశ్యాలు, వింతగొలిపే అనుభవాలు,
ుక్షణమైన గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, చారిత్రక విశేషాలు ఇలా
మనకి తారసపడుతుంటాయి. రకరకాల రుచులను ఆస్వాదిస్తూ, అలల్లో
తేలియాడుతూ సాగే వివిధ రకాల పడవ ప్రయాణాల సమాహారం
ఈ వారం మీకోసం...



...లో..

...కి కొత్త హంగులని అందించే
...జీవకళ ఉట్టిపడుతుంది.
...ద్వీపం 'చార్ చినార్'. కాశ్మీరీ
...ంలో మొలచిన నాలుగు చినార్
...ోట్ షికార్‌లో యాత్రికులు
...ీ పురాతన సంస్కృతిలో
...ప సంగీతంతోపాటు కళాకారుల
...డవ ప్రయాణంలో
...లుస్తాయి. రుచికరమైన కాశ్మీరీ
...ఖవా తేనీటి విందుని
...యాణం చేయాల్సిందే.

అస్సాంలో క్రూయిజ్

అస్సాం పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చేది రుచికరమైన టీ. తేయాకుతోపాటు టెక్స్‌టైల్ పరిశ్రమకి, యేనెస్కో ద్వారా గుర్తించిబడిన వన్య ప్రాణి సంరక్షణ కేంద్రానికి పేరొందిన ఆస్సాంలో వింతగొలిపే మజులి ద్వీప అన్వేషణకు బోటు ప్రయాణం తోడ్పడుతుంది. ప్రపంచంలో అతి పెద్ద నదీ ద్వీపంగా పేరొందిన మజులి దేశీయ తెగలకు నిలయంగా వుంది. సాధారణ పర్యటనల్లో చూసేందుకు వీలుపడని అక్కడి గ్రామీణ తెగలు, సాంప్రదాయాలని వీక్షించేందుకు పడవ ప్రయాణం దోహదపడుతుంది. స్వచ్ఛమైన నీటిని కలిగుండే బ్రహ్మపుత్ర నదికి ఇరువైపులా పచ్చని పంట పొలాలు, తేయాకుతోటల గుండా సాగే ఈ ప్రయాణంలో హిమాలయాల ఆనవాళ్ళు, గిరిజన తెగల సంస్కృతిని ప్రతిబించే గ్రామాలు, వన్య ప్రాణి సంరక్షణా కేంద్రం సందర్శనకు ఎక్కువ మంది బోటు ప్రయాణాన్ని ఎంచుకుంటారు. వివిధ పరిమాణాల్లో లభ్యమయ్యే ఈ బోట్లలో క్రైద్రూ ఒకటి. 12 క్యాబిన్‌లని కలిగుండే ఈ పడవలో పరిమితి తక్కువగా వుంటుంది. పెద్ద బృందంగా వెళ్లే వారు మహాబాహుని ఎంపికచేసుకోవాల్సి వుంటుంది. ప్రయాణీకులకు కావాల్సిన అత్యాధునిక సదుపాయాలన్ని టితో పాటు స్పా, స్విమ్మింగ్ పూల్ వంటి అధునాతన సదుపాయాలూ ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఆస్సామ్ వంటకాలతోపాటు ఆగ్నేయ ఆసియా రుచలని అందించడంలో ఆరితేరిన చెఫ్‌లు ఇక్కడ పనిచేస్తారు. అస్సాంలోని కాజిరంగా నేషనల్ పార్క్‌ని వీక్షించేందుకు సందర్శకులను అనుమతించే నవంబర్ నుండి ఏప్రియల్ నెలల మధ్య కాలం ఇక్కడ పడవ ప్రయాణాలకి అనువైన సమయం.

సుందరమైన చిలికా సరస్సులో వలస పక్షుల మధ్య పడవ

ఒడిశా వలస పక్షుల తీరం

ప్రయాణం అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. ఇక్కడికి చేరుకునే వలస పక్షులతో పాట వేలాది రకాల కొంగలతో చిలికా సరస్సు ఆక్రమించబడి వుంటుందనడంలో అతిశయోక్తి లేదు. వీటితో పాటు డాల్ఫిన్‌లని ప్రత్యక్షంగా వీక్షించేందుకు రాజహంస బీచ్ వద్ద హాల్ట్ వేయాల్సి వుంటుంది. మంగళజోడి వద్ద మొదలయ్యే చిన్న చిన్న మోటర్ పడవలు ఒక్క కుటుంబానికి మాత్రమే పరిమితంగా వుంటాయి. వ్యవసాయ క్షేత్రాలతోపాటు స్థానిక సాంప్రదాయాలని అద్దంపట్టే ఈ పడవ ప్రయాణాలకి ధర కూడా అప్పటికప్పుడే నిర్ణయిస్తారు. దేశవిదేశాల నుండి చిలెక సరస్సులో వాలిపోయే వలసపక్షులని ఫోటోఫ్రేముల్లో బంధించేం దుకు వచ్చే ఫోటోగ్రఫీ హాబీ ఔత్సాహికులతోపాటు, వందల సంఖ్యలో యాత్రికులు చేరుకుంటారు. అక్టోబర్ నుండి ఫిబ్రవరి మధ్య చిలెకా సరస్సు పడవ ప్రయాణాలకి అనువైన కాలం.

అండమాన్ ద్వీపంలో

హిందూ మహా సముద్రం బంగాళా ఖాతం మధ్య ఏర్పడిన అండమాన్ అండ్ నికోబార్ దీవులు పర్యాటంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం. ఈ ద్వీపం రాజధాని నగరం పోర్ట్‌బ్లెయిర్ బలమైన బ్రిటిష్ మూలాల్ని కలిగుంటుంది. మనదేశంలోని అన్ని మెట్రోపాలిటన్ నగరాల నుండి అండమాన్‌కి ఎయిర్‌వేస్ అందుబాటులో వున్నా ఓడ ప్రయాణం యాత్రికులకి ఓ ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తుంది. ఆకుపచ్చని సముద్ర జలాలు నీలి మేఘాల మధ్య అండమాన్ ద్వీపంలో ఓడ ప్రయాణంలో అడుగడుగునా సంభ్రమాలే. అద్భుతమైన ఉష్ణమండల ద్వీపాల చుట్టూ సాగే ఉత్కంఠభరితమ్మైన ప్రయాణంలో సుందర దశ్యాలెన్నో యాత్రికులని కట్టిపడేస్తాయి. చల్లటి గాలుల్లో దూసుకుపోయే ఓడల డెక్ పై భాగంలో పడే వెచ్చని సూర్య కిరణాల మధ్య ఎంతో ఉల్లాసంగా సాగే ఈ ప్రయాణంలో బార్లాంగ్ దీవిలో చూడదగిన ప్రాంతం ఎందుకంటే ఇక్కడే మనకి స్థానికి గిరిజన తెగలు కనిపిస్తారు. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన నీటిని కలిగుండే హెవ్‌లాక్ దీవులు, గుహా మార్గాలు ఉత్కంఠభరితంగా వుంటే, స్కూబా డైవింగ్, స్నోర్కెలింగ్ వంటి వన్నీ ఎంతో ఎంతో ఆనందాన్ని అందిస్తాయి. నిపుణులైన చెఫ్‌లు తయారుచేసే సీ ఫుడ్ వంటకాలతో పాటు, సందర్శకులుని వినోదాన్ని అందించేందు క్రూ ఎన్నో ఉత్తేజకరమ్మైన కార్యక్రమాలని నిర్వహిస్తారు.

- అద్దేపల్లి శర్వాణి





చిలికా సరస్సు

కాశ్మీరీ చార్‌మినార్



కరుణామయుడు

అడవి కాలి బాట పట్టిన నా నడక
ఏకాగ్రత మూస పోసుకుంది
గుండె అదిరే శబ్దాలు
గుండె అలరే శబ్దాలు
అడవి మహా వాయిద్యాగాడు
సప్తస్వరాలు సృష్టిస్తాడు!
సెలయేరు నాట్యం చేస్తూంది
నవ్వుతూ తుళ్లుతూ
ఎగిసిపడే సెలయేటి
గలగలలో ఎన్ని సరిగమలో
కర్ర వంతెన నడుం వంగింది
ఒక బొట్టూ పారని కాలువకు
నా ప్రమేయం ఎందుకనుకున్నదేమో
తన్నుతాను ధ్వంసం చేసుకుంటూంది!
మర్రి చెట్టు ఒకదీవి
పక్షుల్ని పాలిస్తూ వుంది
కొమ్మ కొమ్మకు పక్షుల గూళ్ల గుహలు
చేయి తిరిగిన చేనేత కార్మికులు!
అందని గిజిగాళ్ల అల్లికలు!
ఆత్రుతగా వచ్చిన వేటగాడి పరుగు
నా ఎదుట ఆగిపోయింది
విల్లు బాణాలు మెడలో దారాలు
యమదూతను మరపిస్తూ
నన్ను చూసిన వేటగాడి చూపులు
వెనుదిరిగి
పరుగులంకించాయి!
గాయపడ్డ జింకపిల్ల కుంటుతూ
నా ముందు కూలబడింది
బాధను మోయలేని కనురెప్పలు
మూతబడ్డాయి
జింక పిల్ల తనదన్నాడు
పరుగు పరుగున వచ్చిన
వేటగాడు
వాదన జరిగింది ఘర్షణ పెరిగింది
నూకలు నిండలేదంటూ నిష్క్రమించాడు!
నా భుజంపై కెక్కిన జింకపిల్ల
మనవణ్ణి గుర్తు చేస్తుంది
దాని ఉచ్ఛ్వాస నిశ్వాసలు
ఆశలు రేపుతున్నాయి
ఊరు కనుచూపు దూరంలో వుంది!



- అడిగోపుల వెంకటరత్నం



ఆకలి తీర్చుతుంది

ఆకల పొదరిళ్లు అతడి కళ్లు
నాగలి చక్రాలు అతడి కాళ్లు
భూమి తల్లి ముద్దుబిడ్డలు అతని పాదాలు
గుప్పెడు మట్టికి, జానెడు పొట్టకు వారధులు అతని ఎడ్లు....
అతను నవ్వితే నేల నాట్యమాడుతుంది
అతను ఏడిస్తే నింగి వర్షిస్తుంది
అతని చేయి తాకితే విత్తనం విరగబడి నవ్వుతుంది
అతని శ్వాసతో ఊపిరిపోసుకున్న పొలం పాట పాడుతుంది
అతని ప్రాణామై పండిన పంట అందరి ఆకలి మంటా తీర్చుతుంది.

- అమూల్యా చందు కప్పగంతు
9059824800



ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com

సైన్స్ అండ్ షీ

శాస్త్రీయ రంగంలో మహిళలు, బాలికల ప్రాధాన్యతను పెంచేందుకు అంతర్జాతీయ దినోత్సవాన్ని ఫిబ్రవరి 11న జరుపుకుంటారు. మేరీ క్యూరీ, జేన్ గుడాల్ వంటి మహిళా శాస్త్రవేత్తలు ప్రపంచ గతిని మార్చేసే పరిశోధనలు చేశారు. నోబెల్ బహుమతులు అందుకున్నారు. వీరి స్ఫూర్తితో మరెందరో ఈ తరం సైంటిస్ట్‌లు ఇంతకు మునుపెన్నడూ ఊహించని సరికొత్త పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తున్నారు.

- పోలెండ్‌లోని వార్సాలో 1867లో పుట్టిన మేరీ క్యూరీ రేడియం, పొలోనియం అనే రసాయన మూలకాలను కనుగొన్నారు. 1903లో భౌతిక శాస్త్రం, 1911లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ఏకైక మహిళ.

తెలుసా

- 1934 లండన్‌లో పుట్టిన జేన్ గుడాల్ బ్రిటీష్ ప్రిమిటాలజిస్ట్, ఎథోలాజిస్ట్ కూడా. చింపాంజీలపై లోతుగా పరిశోధన చేసిన మొట్టమొదటి నిపుణురాలు. చింపాంజీలకు బాగా దగ్గరై వాటి ప్రవర్తన, ఆహార నియమాలు, అలవాట్ల గురించి లోతుగా తెలుసుకున్నారు. చింపాంజీలు వాడుకునేలా వేటాడే, తినే పనిముట్లను, ఉపకరణాలను కనిపెట్టారు.

- జర్మనీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, మ్యాథమెటీషియన్ మరియా మేయర్. 1963లో అణు కేంద్రక పరమాణు కవచ నమూనాను కనిపెట్టి నోబెల్ బహుమతిని పొందింది. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన రెండవ మహిళ కూడా మరియానే.

- బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్‌ల్లో వాడే కెవ్లర్ అనే పదార్థాన్ని రసాయనవేత్త స్టెఫనీ క్వొలెక్ అనుకోకుండా ఆవిష్కరించారు. కారు టైర్ల కోసం తక్కువ బరువుండే ఫైబర్‌ను రూపొందించే క్రమంలో ఉక్కు కన్నా 5 రెట్ల దృఢమైన, అతి తేలికైన కెవ్లర్‌ను ఆమె తయారుచేశారు.

- సూది మందు వేసేందుకు వాడే సిరెంజిని 1899లో లెటీషియా గీర్ ఆవిష్కరించారు.

- హార్వార్డ్‌కు చెందిన 'మార్క్-1' కంప్యూటర్‌ను గ్రేస్ హాపర్ హోవార్డ్ ఐకెన్‌తో కలసి రూపొందించారు. ఆమె బగ్, డీ-బగ్గింగ్ వంటి కంప్యూటర్ పదాలను పరిచయం చేశారు. తొలి ఆధునిక ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అయిన కోబాల్‌ను అభివృద్ధి చేసిన జట్టులో ఆమె ఒకరు. తొలి కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా అడా లవ్‌లేస్‌ను పిలుస్తారు. ఆమె చార్లెస్ బాబేజ్‌తో కలసి కంప్యూటర్‌పై పరిశోధించారు.

- టెలీ కమ్యూనికేషన్స్ రంగం తీరు మార్చేసిన మహిళా డాక్టర్ షెర్లీ జాక్సన్. ఆమె పరిశోధనలపైనే ఆధారపడి పోర్టబుల్ ఫ్యాక్స్, ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్, సోలార్ సెల్స్ ఆవిష్కరించడానికి ఆమె అధ్యయనాలే కారణం. ఎంఐటీ నుంచి పీహెచ్‌డీ తీసుకున్న తొలి నల్ల జాతీయురాలామె.

- అలనాటి ప్రపంచ సినీ ప్రేక్షకుల ఆరాధ్య తార హెడీ లామర్ గొప్ప శాస్త్రవేత్త కూడా. ఆమె కనిపెట్టిన ఫ్రీక్వెన్సీ హోపింగ్ టెక్నాలజీ మీద ఆధారపడే వై-ఫై నుంచి జీపీఎస్‌ల వరకు పనిచేస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంలో రేడియో తరంగాలతో నియంత్రించే టార్పెడో ఆయుధాల కోసం దీనిని రూపొందించింది లామర్.



- పాశ్చాత్య వైద్యంలో డిగ్రీ పొందిన మొట్టమొదటి భారతీయ మహిళ ఆనందీ బాయ్ జోషీ. బాల్య వివాహం చేసుకుని పిన్నవయస్సులోనే తల్లి అయింది. ఆమె బిడ్డ జబ్బున పడి సరైన వైద్యం అందక కళ్ల ముందే చనిపోవడంతో చలించిపోయిన ఆమె పెన్సిల్వేనియాలో మెడిసిన్ చదివి వైద్య వృత్తిని చేపట్టింది.

- డాక్టర్ ఇందిర ఇందూజ పేరున్న గైనాకాలజిస్టే కాక ప్రసూతి, సంతానసాఫల్య నిపుణురాలు కూడా. 1986 ఆగస్టు 6న కెఈఎం ఆస్పత్రిలో మొట్టమొదటి టెస్ట్ ట్యూబ్ బేబీ జననానికి కారణం ఇందిరే. గ్రామిట్ ఇంట్రాపెలోఫియన్ ట్రాన్స్‌ఫర్(గిఫ్ట్) చేయడంలో ఎంతో నైపుణ్యం సాధించిన ఇందిర భారతదేశంలో మొట్టమొదటి గిఫ్ట్ బిడ్డను జన్మింపజేశారు.

- అప్పుడే పుట్టిన పిల్లల ఆరోగ్యం ఎలా ఉందనేది తెలుసుకునే అప్‌గార్ పద్ధతిని1952లో డాక్టర్ వర్జీనియా అప్‌గార్ రూపొందించారు.

- కెమెరాలు, కళ్లద్దాలు, మైక్రోస్కోప్‌లు వంటి ఎన్నో వస్తువులకు వాడే అద్దాలను తయారుచేయడానికి కీలకమైన మోనోన్యూక్లియర్ కోటింగ్ పద్ధతిని ఆవిష్కరించింది కేథరిన్ బ్లాడ్జెట్. 'ఇన్విజిబుల్ గ్లాస్'గా పేరొందిన ఈ సరికొత్త అద్దాల్ని తయారుచేసిన కేథరిన్ జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) తొలి మహిళా శాస్త్రవేత్త కూడా.

- 1951లో వాటర్ ప్రూఫ్ బోటర్లను మేరియన్ డోనొవన్ తయారుచేశారు. ఇప్పటి డైపర్లకు అదే కారణం.

- ఎమర్జెన్సీలో ఓడలు, పడవల్లోని ప్రయాణీకుల ప్రాణాల్ని కాపాడే లైఫ్ రాఫ్టర్‌ను తొలిసారిగా తయారుచేసింది మరియా బీస్లీ (1882).



- ఇప్పటి సీసీటీవీలకు కారణం న్యూయార్క్‌కు చెందిన మేరీ వాన్ బ్రిట్టన్ బ్రౌన్. పోలీసుల రాక ఆలస్యమయ్యే క్రమంలో భద్రత కోసం తొలి సర్క్యూట్‌ను ఆమె రూపొందించింది.

- గ్లోబ్‌లని ఎల్లెన్ ఫిట్జ్ (1875), ఎలక్ట్రిక్ వాటర్ హీటర్‌ను ఇడా ఫోర్బ్స్ (1917), రిఫ్రిజిరేటర్‌ను, స్ట్రీట్ క్లీనింగ్ మెషీన్‌ను ఫ్లోరెన్స్ పార్పార్ట్ (1914, 1900) రూపొందించారు.

అభాగ్యుడు

- మౌద్గల్యస
9985050134

కథ

అతను ఒకప్పుడు బాగా బతికినవాడే. పదిహేనో ఏట ఓ ప్రమాదంలో అతని రెండు కాళ్లూపోయాయి. అతని తల రెండు పెద్ద కొండల మధ్య నలిగినట్టుగా తయారయ్యింది. భుజాలు రెండింటిని నేలమీద ఆన్చి క్రచెస్ సాయంతో ఈడ్చుకుంటూ వెళతాడు. పొలాల వెంట, పుట్టల వెంటా రికామీగా అటూ ఇటూ తిరగడం.. వాళ్లూ వీళ్లూ విసిరే నాలుగు మెతుకుల కోసం ఎదురుచూస్తూ బిచ్చమెత్తుకోవటం అతనికి వ్యాపకమైపోయింది.

ఆల్ సెయింట్స్‌డే రోజున ఓ మురికి కాల్వలో అతను లెస్ బిలెట్స్ అనే మత గురువుకి చిన్నప్పుడు దొరికాడు. అనాథయిన అతనికి చదువు సంధ్యలేవీ అబ్బలేదు. బెరోనిస్ డి అవరీ అనే పెద్ద మనిషి కోళ్లఫారం పక్కనున్న ఒక చిన్న కొట్టంలో కొద్ది రోజులపాటు తలదాచుకునే అవకాశాన్ని అతనికి కల్పించాడు. ఆ కాసిని రోజులు మాత్రం అతనికి సంతోషంగా గడిచాయి. అప్పుడప్పుడు అందే బ్రెడ్ ముక్కలు అతని కడుపు నింపేవి. ఆ ఇంట్లో ఉన్న వృద్ధురాలు అప్పుడప్పుడు చిల్లర నాణాలు విదిలించేది. ఆమె కన్నుమూయటంతో అతని బతుకు దుర్భరమైంది. అప్పట్లో బేకరీవాడిచ్చిన ఉచిత మద్యం తాగటం వల్ల అతని శరీరమూ క్షీణించింది.



ఆ గ్రామంలో అతనికి ఆహారం అందించేవారు బాగా తక్కువ. అతన్ని చూసిచూసి విసిగెత్తిపోయింది వాళ్లకి. ఒకటా రెండా.. దాదాపు 40 ఏళ్లుగా వారు అతన్ని చూస్తున్నారు. అతనికి కూడా అంతే.. ఈ భూప్రపంచం మీద తెలిసింది మారుమూల ఉన్న ఈ ప్రాంతమే. చుట్టు పక్కలున్న మూడు నాలుగు గ్రామాలే. ఎప్పుడో గానీ అతను గ్రామం విడిచి వెళ్లడు. కనుచూపు మేర కనిపించే దట్టమైన చెట్ల వెనుక ఇంకా ఏముంటుందో తెలుసుకోవాలన్న కుతూహలం అతనికి లేదు. ఎక్కడికయినా దూరంగా వెళితే బాగా తిండి దొరుకుతుంది కదా అన్న ఆలోచన కూడా అతనికి లేదు. ఎప్పుడయినా ఏ పొలాల మధ్యకో వెళ్లినప్పుడు రైతులు తారసపడి 'ఎప్పుడూ ఇక్కడే ఉండి నీ వెధవ మొహం చూపించకపోతే ఇంకెక్కడయినా పోరాదా' అంటూ దెప్పిపొడుస్తారు. అతను నోరు మెదపడు. వ్యక్తుల వెక్కిరింతలు, అవమానాలను భరించటం అతనికి అలవాటయిపోయింది. కొత్త మొహాలను చూసి అతను వణికిపోతాడు. ముఖ్యంగా ఏ రోడ్డు మీదో పోలీసులు అటుగా వెళుతూ కనిపిస్తే మాత్రం అతను అక్కడ ఉండడు. గబుక్కున ఏ పొదలమాటుకో, గుట్టల వెనుకో జరిగి వారి కంట పడకుండా జాగ్రత్త తీసుకుంటాడు. ఆ సమయంలో అసలు అతనికంత ధైర్యం ఎక్కడి నుంచి వస్తుందో తెలీదు. అడవిలో సాధు జంతువులు క్రూరమృగాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటాయో.. పోలీసుల విషయంలో అతని ప్రవర్తన అలా ఉంటుంది.

పోలీసులకు అతనెప్పుడూ చిక్కలేదు. వారి నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. మరి భయం ఎందుకన్న ప్రశ్నకు సమాధానం లేదు. తలదాచుకోటానికి అతని కంటూ ప్రత్యేకమైన గూడు ఏదీ లేదు. వేసవిలో ఏదో ఒక అరుగును ఆశ్రయించేవాడు. శీతాకాలాల్లో పశువుల కొట్టాలు, గుర్రపుశాలల్ని వెతుక్కునేవాడు లోపలకి వెళ్లేందుకు చిన్న మార్గం ఉంటే చాలు. అత్యంత లాఘవంగా తన శరీరాన్ని వంచి అందులోకి చేరేవాడు. నాలుగయిదు రోజుల వరకూ ఇతరుల కంటపడకుండా జాగ్రత్తలు తీసుకునేవాడు. అడవిలో జంతువులకి, అతనికి పెద్ద వ్యత్యాసం కనిపించదు. మనుషుల మధ్యనే నివసిస్తున్నా అతనికి తెలిసిన వారు గానీ, అతను ప్రత్యేకంగా ఇష్టపడేవారు గానీ ఎవరూ లేరు. అటూ ఇటూ తిరిగే కొందరు రైతులు మాత్రం వ్యంగ్యంగా అతన్ని 'బెల్' అనే పేరుతో సంబోధించేవారు. రెండు చర్చిగోడల మధ్య వేలాడే గంటలా.. చెక్క క్రచెస్ పైన చప్పుడు చేస్తూ అతను కదిలేవాడు. అందుకే అతనికి ఆ పేరు తగిలించారు.

ప్రస్తుతానికి వస్తే..

గత రెండు రోజులుగా అతనికి తిండి లేదు. దయతలచి ఒక్కరు కూడా అతనికి ఏమీ పెట్టలేదు. అతన్ని చూడగానే చాలా మందికి సహనం నశించింది. ఆడవాళ్లయితే దూరం నుంచి చూసి తిట్టటం మొదలుపెట్టారు. 'మూడు నాలుగు

రోజుల క్రితమే కదా! బాగా మెక్కపెట్టాను. మళ్లీ తినటానికి వచ్చావా? అంటూ విసుక్కున్నారు.

అంతే.. అతను ఆ ఇల్లు వదిలి పక్కింటికి వెళ్లాడు. అక్కడా అతనికి అలాంటి మార్యాదలే జరిగాయి.

ఇంటి గుమ్మాల దగ్గర నిలబడి 'ఏడాది పొడవునా వీడికి మింగబెట్టటం మన వల్ల అయ్యే పని కాదు' అని చెప్పుకున్నారు ఒకరికొకరు నవ్వుకుంటూ.

సెయింట్ హిలేరీ, వావిల్లె, లెస్ బిల్లేట్స్‌లో అతనికేమీ పుట్టలేదు. ఇక మిగిలింది టోర్నోల్స్.. అక్కడికి వెళ్లాలంటే కనీసం ఐదు కిలోమీటర్లు ప్రయాణించవలసిందే.

'నకనకలాడుతున్న కడుపుతో ఒక్క అడుగు కూడా వేయలేని పరిస్థితుల్లో ఈ శరీరాన్ని ఈడ్చుకుంటూ అంత దూరం వెళ్లటం కష్టమయ్యే పనే. కానీ తప్పదు మరి. జేబులో చిల్లిగవ్వ కూడా లేదు. రేపు ఎలా గడుస్తుందో అర్థం కావటం లేదు.' విచారపడుతూ బయలుదేరాడు.

అసలే డిసెంబరు మాసం. చలిగాలులు వెంటాడుతున్నాయి. ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. చెక్క క్రచెస్‌ను నెట్టుకుంటూ ముందుకు సాగుతున్నాడు.

అప్పుడప్పుడు కాసేపు విశ్రాంతి తీసుకుంటూ.. కాళ్లీడ్చుకుంటూ వెళు తున్నాడు.

ఆకలి ప్రేవుల్ని మెలిపెడుతోంది. ఏదో ఒకటి కడుపులో వేయాలన్న కోరిక దహిస్తోంది. అదెలా అన్నదే బలహీనపడిన అతని మనసుకు తట్టటం లేదు.

మూడు గంటల పాటు అతను ప్రయాణం చేశాడు. చెట్లు కనిపించేసరికి అతనికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

'హమ్మయ్య.. గ్రామం వచ్చేసింది' కొత్తశక్తిని పుంజుకుంటూ అనుకున్నాడు.

ఈ లోపు ఎవరో రైతు తారసపడ్డాడు. హఠాత్తుగా అతన్ని చూసి 'మళ్లీ' తయారయ్యావా. ఈ ఊళ్లోకి. నీ బెడద మాకు తీరేట్టు లేదు..” అన్నాడు విసుగ్గా.

బెల్ అదేం పట్టించుకోలేదు. ఓపిగ్గా ఇళ్లిల్లూ తిరిగాడు. సూటిపోటి మాటలు తప్ప అతనికేమీ దక్కలేదు.

పక్కనే ఉన్న పొలాల దగ్గరకూ నడిచాడు.

ఒక్క అడుగు వేయటానికి కూడా శరీరం సహకరించటం లేదు. క్రచెస్‌ను పక్కన పెట్టేశాడు. 'ఇంతకంటే దురదృష్టకరమైన రోజు ఇంకొకటి ఉండదు' అనుకుంటూ అక్కడే

కూలబడిపోయాడు. అతని శరీరంలో సత్తువ సన్నగిల్లింది. కడుపులో ఆకలి తీవ్రం కావటం వల్ల అటూ ఇటూ కదపటం కూడా సాధ్యం కాలా..

“ఒక్క దయార్ద్ర హృదయమైనా స్పందించకపోతుందా? స్వర్గంలో ఉన్న భగవంతుడు కరుణించకపోతాడా?..”

ఏదో తెలియని ఆశ అతని ఊపిరి నిలుపుతుంది.

చలిగాలులు ఈడ్చి తంతున్నా అలాగే ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో అతని చూపు ఎదురుగా కనిపిస్తున్న జీవాలపైన పడింది.

అక్కడ కొన్ని కోడిపిల్లలు నేల మీద చెల్లాచెదురుగా పడిన గింజలను, చిన్న చిన్న పురుగులని ఏరుకుని తింటున్నాయి.

ముందు వాటిని మామూలుగా చూశాడు. అంతలోనే హఠాత్తుగా ఏదో ఆలోచన వచ్చింది.

అది మెదడు నుంచి వచ్చినది కాదు. ఆకలి అతని చేత ఆ పని చేయించిందేమో.. ఏదో ఒక పిల్ల కోడిని పట్టి కాల్చి తింటే కడుపు నిండుతుంది కదా అన్నది ఆ ఆలోచన. ఆ క్షణంలో అతనికి తప్పు చేస్తున్నానన్న ఆలోచన రాలేదు.

తనకు అందుబాటులో ఉన్న రాయి తీసుకుని గురి చూసి ఒక కోడిపిల్ల మీదకు విసిరాడు. అంతే.. రాయి తగిలి ఆ కోడిపిల్ల పక్కకు ఒరిగిపోయింది. మిగిలిన కోడిపిల్లలు చెల్లాచెదురయ్యాయి.

'బెల్' మెల్లగా క్రచెస్‌ను ఈడ్చుకుంటూ కిందపడిపోయిన కోడిపిల్లను తీసుకుందామని ముందుకు వెళ్లాడో లేదో..

వెనక నుంచి ఓ బలమైన హస్తం అతన్ని బలంగా తాకింది. ఆ దెబ్బకి అతనికి కళ్లు బైర్లుకమ్మాయి. మనిషి పది అడుగుల దూరంలో పడ్డాడు. తనపైన దాడి చేసింది ఆ కోళ్ల సొంత దారు రైతు అని అర్థం కావటానికి అతనికి ఎంతో సేపు పట్టలేదు. రైతు కోపం ఇంకా తగ్గినట్టు లేదు.

అతన్ని అందిన కాడికి చితకబాదుతూనే ఉన్నాడు.

నిలువెల్లా గాయాలు.. ఆకలి బాధలతో బెల్‌కి దాదాపు స్పృహ తప్పినంత పనైంది. నేలమీద అలా కూలబడిపోయాడు.

అతను ఎంతసేపు అలా ఉన్నాడో..

సాయంత్రం అయ్యింది. ఆ తర్వాత దట్టమైన చీకట్లు అలుముకున్నాయి. మళ్లీ తెల్లవారింది. ఒక్క మెతుకు ఆహారం కూడా అతని కడుపులో పడలేదు.

మధ్యాహ్నమయ్యేసరికి పోలీసులొచ్చారు.

పంటపొలంలో ఓ మూల కొట్టంలో ఉన్న అతన్ని బయటకు తేవటానికి ప్రయత్నించారు. అతని నుంచి ప్రతిఘటన ఉంటుందేమో అని ముందు భయపడ్డారు.

'నా మీద దాడి చేయబోయాడు. అతి కష్టం మీద బయటపడ్డాను. ఆత్మరక్షణ కోసం అతన్ని గాయపరచవలసి వచ్చింది' అని రైతు ఫిర్యాదులో పేర్కొనటంతో పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

పోలీసు సార్జంట్ గట్టిగా అరిచాడు.

'రా బయటికి రా..' గద్దించినట్టుగా అన్నాడతను.

బెల్‌లో కదలిక లేదు. క్రచెస్‌తో మెల్లగా పైకి లేవాలని ప్రయత్నించినా

సాధ్యం కాలేదు. అతని బలహీనత అర్థం కాని పోలీసులు అదంతా నటన అనుకున్నారు. అతని బయటకు లాగి క్రచెస్ మీద బలవంతంగా నిలబెట్టారు.

అతనికి పోలీసులంటే మొదట్నుంచి భయం. పాదాల నుంచి మెదడు వరకూ శరీరమంతా గజగజా వణుకుతోంది. దానికి తోడు శరీరం నీరసించిపోయింది.

'ముందుకు కదులు' పోలీసుల హెచ్చరికలతో అతి కష్టం మీద అతనిలో కదలిక మొదలయ్యింది. చుట్టు పక్కల వారంతా ఈ దృశ్యాన్ని చూశారు.

అతని గురించి కొద్దో గొప్పో తెలిసిన వారంతా మొటికలు విరుస్తూ.. 'ఇన్నేళ్లకు వీడి పీడ విరగడ అయ్యింది' అని సంబరపడ్డారు.

కొత్త వాళ్లు.. అతనేదో దొంగతనం చేసుంటాడు. అందుకే 'పోలీసులు పట్టుకుపోతున్నారు' అనుకున్నారు.

పోలీసులు చెరోవైపు నడుస్తుండగా.. అతి కష్టం మీద నడుస్తూనే ఉన్నాడు.

సాయంత్రానికి పట్టణ పోలీస్ స్టేషన్‌కి చేరాడు.

అంతకు ముందెప్పుడూ అతను ఆ ప్రదేశాన్ని చూడలేదు. అంతా కొత్తగా ఉంది.

ఇక్కడికెందుకు తెచ్చారో.. తనను ఏం చేయదలుచుకున్నారో.. అతనికి అర్థం కాలేదు. గత రెండు రోజులుగా అతని జీవితంలో ఎన్నో అనూహ్య సంఘటనలు చోటు చేసుకున్నాయి. అపరిచిత వ్యక్తులు తారసపడ్డారు.

అతను నోరుతెరిచి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. గత కొన్నేళ్లుగా ఒక్క మాట కూడా అతను మాట్లాడకపోవటంతో నాలుక తన శక్తిని కోల్పోయింది. ఆలోచనలను మాటల రూపంలో మలచే శక్తినీ అతను కోల్పోయాడు.

జైలులో అతన్ని ఎవరూ పట్టించుకోలేదు. అతను తిన్నాడా లేదా పట్టించుకోవాలన్న ఆలోచన పోలీసులకూ రాలేదు. మరుసటి రోజు వరకూ అతన్ని పట్టించుకున్న వారే లేరు.

ఉదయం అక్కడకు వచ్చిన పోలీసులకు నిర్జీవంగా నేల మీద పడి ఉన్న అతని శరీరం కనిపించింది.

పాపం..

చివరికి ఆ అభాగ్యుడి కథ ఆ విధంగా ముగిసిపోయింది.



30 ఏళ్ల దత్తపుత్రులు

ఎవరైనా పురిటి బిడ్డను దత్తత తీసుకోవడం చూశాం. ఒకటి, రెండేళ్ల పిల్లలను దత్తత తీసుకోవడం చూశాం. కానీ ఏకంగా 30 ఏళ్ల యువకులని దత్తత తీసుకోవడం ఎక్కడైనా చూశారా! కానీ అలాంటి పద్ధతి జపాన్‌లో ఉంది. అవును వారి వారసత్వ వ్యాపార అవసరాలకు యువకుడైతేనే సూటవుతాడు. అక్కడ మగసంతానం లేని తల్లిదండ్రులు, వ్యాపారానికి అసమర్థ పుత్రుడు న్నవారు, సమర్థుడైన యువకుడిని దత్త పుత్రుడిని చేసుకుని వ్యాపార వారసుడిగా పట్టం కడ్తారు.

జపాన్‌కి చెందిన పేరున్న కంపెనీలు ఎక్కువగా దత్తపుత్రుల నిర్వహణలోనే ఉన్నాయట. ఏటా 80 శాతం దత్తత స్వీకరణలు జరుగుతుంటాయి. అందులోనూ 20 నుండి 30 సంవత్సరాల మధ్య యువకులు 98 శాతం మంది ఉంటున్నారు. దీనిని బట్టే జపాన్ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఇలా చేయడానికి ఒక కారణం ఉంది. వ్యాపారం అంటే ఎంతో తెలివిగా, చాకచక్యంగా చేస్తేనే లాభాల దిశలో ఉంటుంది. దానికి తెలివైన యువకులైతేనే సమర్థులు. ప్రపంచ దిగ్గజ కంపెనీలైన సుజుకీ, టయోటాలాంటి సంస్థల కుటుంబాలు కూడా దత్తపుత్రుల ద్వారానే వందల సంవత్సరాల నుండి నడుస్తున్నాయి. సుజుకీ కంపెనీ అధిపతి ఒసాము సుజికీ ఈ కోవలోకి చెందిన వాడే. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జపాన్‌లో కేవలం కొడుకులకి మాత్రమే వారసత్వ సంపద చెందుతుందని ఉండేది. అందువల్ల వ్యాపారాభివృద్ధి కోసం యువకులను దత్తత తీసుకునే పద్ధతిని ఆరంభించారు. చట్టపరంగా అమ్మాయి ఆస్తికి అనర్హురాలైనందున అబ్బాయిను ఎంచుకుంటున్నారు. అమ్మాయికి వ్యాపారానికి అర్హుడైన అబ్బాయినే అల్లుడిగా ఎంచుకుని అతనినే దత్త పుత్రుడిగా తమ వ్యాపారానికి వారసుడిని చేస్తున్నారు కొందరు. జపాన్‌లో ఈ పద్ధతి పూర్వం నుండీ ఉంది. కొందరు పిల్లలు లేని వారు తమ మరణానంతరం వ్యాపార వారసులుగా, ఇంటి పేరు నిలబెట్టడానికి ఇలా చేస్తున్నారు. ప్రపంచంలోనే పూర్వం నుండి వ్యాపారాలను కొనసాగిస్తున్నవారిలో ప్రతి ఐదుగురిలో జపాన్‌కు చెందినవారు ఒకరుంటారు. వీరిలో 578 సంవత్సరంలో బౌద్ధ దేవాలయాన్ని నిర్మించిన కాంగో గుమీ ఒకరు. ఆయన ప్రారంభించిన వ్యాపారాన్ని 2006 వరకు ఆయన కుటుంబం కొనసాగించి ప్రస్తుతం దానిని తకామత్సు సంస్థలో కలిపారు. తమ వారసులకి సరైన సామర్థ్యం లేనప్పుడు అర్హతలున్న యువకుడిని చూసి దత్తత చేసుకుంటారు. తర్వాత కొన్ని రోజులు వారి పనితీరు చూసి వ్యాపార బాధ్యతలు అప్పజెప్తారు.

జపాన్‌లో ప్రస్తుతం జననాల రేటు పడిపోతున్నందున అమ్మాయిల తల్లిదండ్రులు ఎక్కువగా అల్లుడినే దత్తత తీసుకుంటున్నారు. దత్త పుత్రులకు పేరు మారినా పెద్ద సమస్యేమి లేదట. ఆ పేరును ఫ్యామిలీ రిజిష్టర్‌లో ముద్దుపేరుగా చూసుకుంటారట. జపాన్‌లో దాదాపు చిన్నపిల్లల దత్తత నిషేధమనే చెప్పాలి. ప్రస్తుతం 39 వేల మంది అనాథ పిల్లలు ప్రభుత్వ సంరక్షణలో ఉన్నారని ఓ లెక్క. వీరిలో కేవలం సంవత్సరానికి 300 మంది పిల్లలనే దత్తత తీసుకోవడం జరుగుతుంది. అంటే ఇక్కడ మానవీయ కోణం కన్నా వ్యాపార దృక్పథం ఎక్కువ కనిపిస్తోంది. ఆడపిల్లలపై ఇంకా వివక్ష కొనసాగుతున్నపుడు అభివృద్ధి చెందినట్లు అనుకోవచ్చా..? అభివృద్ధి అంటే కేవలం వ్యాపారం, పెట్టుబడి, భౌతిక సంపదతోనే ముడేయవచ్చా..? అందుకే ఇలాంటి విపరీతాలు కనిపిస్తుంటాయి.

ఐడియాలు అమ్మబడును

చుట్టూ జరుగుతున్న సంఘటనలకు కథకులు స్పందిస్తారు. వాటిని కథలుగా మలుస్తారు. అయినాల కనకరత్నాచారి రాసిన ఈ 'ఐడియాలు అమ్మబడును' కథలు ఆ ప్రతిస్పందనే. 10 కథలు 3గల్పికాలు కలిసి ఈ సంపుటిలో వున్నాయి. మెదటి కథ 'ఐడియాలు అమ్మబడును' సరుకుల అమ్మకానికి ప్రజల భక్తిని ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుపుతుంది. 'మంత్రిగారి సర్జరీ', 'స్వచ్ఛభారత్' కథలు నేటి రాజకీయ పరిస్థితికి అద్దం పట్టాయి. 'చీకటినగ', 'చెడిన చిత్రం', 'ఏం మగాళ్లో' కథలు కుటుంబ జీవితంలోనూ, భార్యాభర్తల మధ్య వచ్చే అనుమానాలు మనస్పర్థలకు సంబంధించినవి. 'చతుర్ముకి' కుటుంబాలలోని ఆడవాళ్ళ పెత్తనం గురించినవి కాగా, సుశీల 'చచ్చిపోయింది' కథలో భర్త అపార్థానికి సంబంధించినది 'స్టోరీ 2040' నాటికి పెళ్ళికి ఆడపిల్ల దొరకని పరిస్థితి ఎలా నెలకొందో తెలిపేది. రచయిత శైలి హాస్య , వ్యంగ్యాలతో కూడుకున్నది. చదివించే లక్షణం ఉన్నది. సమాజాన్ని ఉన్నదున్నట్లు పరిశీలించి కథలు రాస్తేనే సరిపోదు. సమాజాన్ని ముందుకు నడిపే అవకాశాలను, ఆలోచనలను ప్రజలకందించటం కూడా కథకుని బాధ్యతని గుర్తించాలి. కనకరత్నాచారికి మంచి భవిష్యత్ ఉన్నది. స్వయంగా రచయిత ప్రచురించుకున్న ఈ కథల సంపుటి చివరి అట్టపేజీ పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేసింది.



పుస్తకం పేరు : ఐడియాలు అమ్మబడును (కథాసంపుటి)
రచయిత : అయినాల కనక రత్నచారి
పేజీలు : 103
వెల :100/-
ప్రతులకు: ఆయినాల కనకరత్నాచారి, కోరిశపాడు పోస్ట్, ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-523212,
ఫోన్ : 9000840960

రెండు తరాల ప్రేమ కథనం



సమాజంతో సంబంధం లేని రచనలు సాహిత్యలోకంలో ఎక్కువ కాలం మనుగడ సాగించలేవన్నది ఇటీవలి నిజం. కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాలను లోతుగా విశ్లేషిస్తూ రెండు తరాల ప్రేమ కథలను ఒకే నేపథ్యంలో వివరించే ప్రయత్నాన్ని చేసారు రచయిత కొండవలస శ్రీనివాసరావు తన 'సర్వోదయ' నవలలో. మానవ జీవితంలోని వివిధ కోణాల్లో సమగ్రమైన ఘటనలను ఈ నవలలో కథగా చిత్రించారు రచయిత. ఇందులో తండ్రీ కొడుకులైన రఘురామ్, రాజ్ కమల్ పాత్రల చుట్టే కథంతా తిరుగుతుంది. సర్వోదయను రఘురామ్ దూరం చేసుకున్నప్పటికీ, రఘురామ్‌కు తెలియకుండానే అతని కుమారుడైన రాజ్ కమల్‌ని ఆదరించి వాసంతితో ఆతని వివాహాన్ని సర్వోదయ జరిపిస్తుంది. జీవితంలో తానందుకోవలసిన ఫలితాలను తన సన్నిహితులు అందుకోవడంలో ఆమె తోడ్పాటు అందిస్తుంది. ఈ నవలలోని మిగిలిన పాత్రలు ప్రసాదరావు, పోలయ్య వంటివారితో కథను ఆసక్తికరంగా మలిచారు రచయిత. అయితే కథనంలో అక్కడక్కడా స్పష్టత లోపించింది. అక్షర దోషాలు కూడా ఉన్నాయి. వాక్య నిర్మాణం విషయంలో మరింత శ్రద్ధ చూపితే బాగుండేది. రచయిత స్వస్థలం శ్రీకాకుళం జిల్లా టెక్కలి అయినప్పటికీ ప్రస్తుతం ప్రవాసాంధ్రునిగా జంషెడ్‌పూర్‌లో ఉంటున్నారు. తెలుగు భాషపై చెక్కు చెదరని మమకారంతో సాహిత్య సృజన చేస్తుండడం అభినందనీయం.

రచన : కొండవలస శ్రీనివాసరావు
పేజీలు : 104,
ధర: 99రూ.
కాపీలకు : కొండవలస శ్రీనివాసరావు
క్వార్టర్ నెం. 85/3
రైల్వే ట్రాఫిక్ కాలనీ
జంషెడ్‌పూర్-831002
మొబైల్ : 9801192088

- బెందాళం క్రిష్ణారావు

రహస్య గ్రంథాలయాలు

పుస్తకమంటే కొన్ని తెల్ల కాగితాలు వాటిపై నల్ల అక్షరాలేనా..! పుస్తకం ప్రపంచ గతిని మార్చేసింది. మార్చేస్తోంది. అందుకే దాన్ని ధ్వంసం చేయడమనేది ఓ యుద్ధ తంత్రం. సాహిత్యాన్ని కనుమరుగు చేయడమనేది అరాచకవాదుల కుటిల యత్నం. ప్రపంచ చరిత్ర, సాహిత్యంలో మనకు అందుబాటులో ఉన్నది అత్యల్పమనే చెప్పాలి. కొన్ని కాలగర్భం లో కలసి పోతే మరికొన్ని యుద్ధాల్లో ధ్వంసం చేయబడ్డాయి. ఒకప్పటి ప్రసిద్ధి గాంచిన అలెగ్జాండ్రియా గ్రంథాలయాన్ని అనేక మార్లు దహనం చేశారంటే దాని ప్రభావం, విలువ ఎంత టివో అర్థమవుతుంది. అందుకే ఇలాంటి విలువైన సాహిత్యాన్ని చాలా రహస్యంగా దాచుకోవడం అలవాటుగా మారింది. ఒక పుస్తకం కొన్ని గ్రంథా లు ఏకంగా గ్రంథా లయాల్నే రహస్యంగా ఉంచారు. పురాతన సాహి త్యాన్ని, శాస్త్రాల్ని ఇప్పటికీ కలిగున్న కొన్ని రహస్య గ్రంథాలయాల వివరం ఈ వారం.

దున్‌హువాంగ్ గుహల్లో...

పశ్చిమ చైనాలోని గోబీ ఎడారి అంచున దున్‌హువాంగ్ గుహల నెట్‌వర్క్‌లో ఓ రహస్య గ్రంథాలయం ఈ మధ్యే వెలుగులోకి వచ్చింది. ఆ గుహ సముదాయంలో ఓ భాగాన్ని 'థౌజండ్ బుద్ధా గ్రోటోస్' (వేల బుద్ధ కుహరాలు) అని పిలుస్తారు. ఈ గుహలు వెయ్యి సంవత్సరాల పాటు 19వ శతాబ్దం వరకు మూసివేయబడ్డాయి. వాంగ్ యువాన్లు అనే వ్యక్తి ఓ తావోయిస్ట్ సన్యాసి రాసి భద్రపరచి ఉంచిన గది రహస్య మార్గాన్ని కనిపెట్టాడు. ఆ గది ఎత్తు 10 అడుగులు ఉంది. ఆ గ్రంథాలను పరిశీలించి చూడగా 11వ శతాబ్దం నాటివని తేలింది. అప్పట్లో చైనీస్ అధికారులు వాటిపై అంతగా ఆసక్తి చూపలేదు. కానీ బీజింగ్ అధికారులు మాత్రం ఈ పత్రాలు ఏ కాలం నాటివి? ఎన్ని ఉన్నాయి అనే విషయాలపై దర్యాప్తు చేయించారు. అప్పటికే వాటిలో చాలా పుస్తకాలు పాడయ్యాయని తేలింది. వాటిని ఎందుకలా దాచి ఉంచారో ఇప్పటికీ అంతుచిక్కని సమస్యగానే మిగిలిపోయింది. అప్పట్లో పొరుగు రాజ్యాల దండయాత్రల భయం ఉండేది. ఖోటాన్ పొరుగు నగరాలను ధ్వంసం చేసి గ్రంథాల్ని, సాహిత్యాన్ని కూడా కాల్చేస్తున్నారనే భయంతో చరిత్ర కనుమరుగు కాకుండా పత్రాలను గుహల్లో దాచారని పరిశోధకులు భావిస్తున్నారు.

వాటికన్ ఆర్కైవ్స్

ప్రపంచంలోని అత్యంత విస్తృతమైన రహస్య గ్రంథాలయాల్లో వాటికన్ ఆర్కైవ్స్ ఒకటి. ఇది ఇటీవలే తెరవబడింది. ఇప్పటికీ కొన్ని విభాగాల్ని అత్యంత జాగ్రత్తగా రహస్యంగా ఉంచుతున్నారని, వాటికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారనే వాదన ఉంది. వాటికన్ ఆర్కైవ్స్‌లో దాగి వున్న కళాఖండాలలో గ్రహాంతరపు పుర్రెలు, క్రీస్తు వంశ పరంపరే కాక టైమ్ మెషీన్‌కు సంబంధించిన శాస్త్రీయ గ్రంథాలు ఉందని ఈ విషయాల్ని బయటకి వెల్లడించాలని కొందరు అధ్యయనవేత్తల భావన. దీనిలోని విలువైన సమాచారం అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అనేకమంది మేధావులు కొన్ని విభాగాల్ని తెరవడానికి అనుమతి తీసుకున్నారు. దీనిలో ఉన్న డాక్యుమెంట్లు 1939 నుండి ఇప్పటి వరకూ ప్రజలకు అందుబాటులో లేవు.

కైరో జినిజాహ్

ఈజిప్టులోని కైరో జినిజాహ్ గ్రంథాలయంలో ఎన్నో శతాబ్దాలుగా పుస్తకాలను సేకరించి రహస్యంగా దాచిపెట్టారు. వీటిని ప్రభుత్వం సాయుధ దళాల రక్షణలో ఉంచిందనుకుంటే పొరబడినట్లే. 19వ శతాబ్దం వరకూ ఎవరు పట్టించుకోక అవి రహస్యంగానే ఉన్నాయి. కైరోలోని బెన్ ఎజ్రా భవంతిలోని లోపలి గోడలపై 28 వేల పత్రాలున్నాయి. దీనినే కైరో జెనీజాహ్ అని పిలుస్తారు. వీటిని మొదటగా జాకోబ్ సాఫిర్ అనే పర్యాటకుడు గుర్తించి తన పుస్తకంలో వాటి గురించి వర్ణించాడు. ఆ తర్వాతనే ప్రపంచ యాత్రికుల దృష్టిని ఆకర్షించి గుర్తింపు లభించింది. ఈ రాతప్రతులలో 9వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకూ యూదుల జీవనశైలి ఎలా ఉందో వర్ణించారు. ఇవి ప్రాచీన సమాజంలోని ఏకపక్ష ధోరణులపై అవగాహన కలిగిస్తాయి.

లైడెన్ యూనివర్సిటీలో

ఇది నెదర్లాండ్‌లోని పురాతనమైన విశ్వవిద్యాలయం. దీనిని 1575లో విలియం ఆఫ్ ఆరెంజ్ స్థాపించాడు. మధ్యయుగపు సాహిత్యంలో ప్రత్యేకతను సంపాదించిన ఎరిక్ క్వాకెల్ అనే డచ్ చరిత్రకారుని శిష్యులు లైడెన్ యూనివర్సిటీలో చదువుతున్నారు. వారు 2013లో 132 ఉత్తరాలు, కొన్ని గ్రంథాలు, రైన్ ప్రాంతంలో ఇప్పటి వరకూ ఎవరూ గుర్తించనటువంటి కోటలను కనుగొన్నారు. ఈ రాతప్రతులు 1577 నుంచి 2013 వరకు దాచి ఉంచబడ్డాయి. అందులోని సమాచారం విలువైనదైనా ఎవరి కాలంలోవి అనే వివరాలు ఇప్పటి వరకూ తెలియవు.

హిట్లర్ కుటిలత్వం..

యూదుల ప్రభావం జర్మన్ సంస్కృతిపై తీవ్రంగా ఉండేది. హిట్లర్ దానిని ఎలాగైనా తొలగించాలనే ఉద్దేశంతో 1933, మే10న ఒకేసారి 25 వేల సాహిత్య పుస్తకాలను దగ్ధం చేయించాడు. వాటిలో అనుకోకుండా సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ లాంటి ఎందరో రచయితలు రాసిన విలువైన పుస్తకాలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి.



రాయల్ లైబ్రరీ ఆఫ్ అలెగ్జాండ్రియా

ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలోని రాయల్ లైబ్రరీ ఆఫ్ అలెగ్జాండ్రియా ప్రపంచంలోని పురాతనమైన, అతిపెద్ద గ్రంథాలయాల్లో ఒకటి. దీనిలో అనేక సార్లు పుస్తకాలు తగలబడిన సందర్భాలున్నాయి. మొట్టమొదట లైబ్రరీ తగలబడటానికి ప్రధాన కారకుడు రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్. నౌకలకు నిప్పంటించగా మంటలు వ్యాపించి లైబ్రరీ కూడా తగులబడింది. ఆ తర్వాత అనేక దండయాత్రలు, యుద్ధాల్లో అది ఆరుసార్లకు పైగా ధ్వంసం చేయబడింది. అందులోని కొన్ని గ్రంథాలను జాగ్రత్తగా రహస్య గ్రంథాలయాలకి తరలించారని వాదన ఉంది. వాటి జాడ కోసం అన్వేషకులు వెదుకుతూనే ఉన్నారు.

- ఇహశ్రీ

ఆలూ కొత్తిమీర రైస్

కావాల్సిన పదార్థాలు

బియ్యం-1కిలో
బంగాళాదుంపలు-అరకిలో
కొత్తిమీర-2 కట్టలు
పచ్చిమిర్చి-100గ్రాములు
ఉప్పు-తగినంత
నూనె-సరిపడా

తయారీ విధానం

ముందుగా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. తర్వాత బంగాళదుంపలను చెక్కుతీసి చిన్నచిన్న ముక్కలుగా తరుగుకోవాలి. కొత్తిమీరను శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి అందులో పచ్చిమిర్చి, ఉప్పు వేసి నీరు పోసి మెత్తగా పేస్ట్ చేసి పెట్టుకోవాలి. తర్వాత గ్యాస్‌పై పాన్ పెట్టి అందులో నూనె వేడిచేయాలి. వేడి నూనెలో తరిగి పెట్టుకున్న బంగాళదుంప ముక్కలను వేసి ఐదు నిముషాల పాటు దోరగా వేగించుకోవాలి. తర్వాత రుబ్బి పెట్టుకున్న కొత్తిమీర పేస్టుని కూడా వేసి మరో 5 నిముషాలు మగ్గనివ్వాలి. తర్వాత వండి పెట్టుకున్న అన్నాన్ని ఒక పళ్ళెంలోకి తీసుకుని దానిపై మిశ్రమాన్ని వేసి బాగా కలుపుకోవాలి. దోరగా వేయించిన బంగాళాదుంప చక్రాల్ని అలంకరణ కోసం అన్నంపై పెట్టాలి. దీన్ని ఉల్లిచట్నీ లేదా టమోటా పెరుగు పచ్చడితో తింటే రుచిగా ఉంటుంది.

పల్లీ రైస్



కావాల్సిన పదార్థాలు

బియ్యం-ఒక కప్పు
వేగించిన పల్లీలు-అర కప్పు
పసుపు-అర టీ స్పూను
నూనె-3 టేబుల్ స్పూన్లు
నువ్వులు-అర టీ స్పూను
ఎండు మిర్చి-3
కొబ్బరి తురుము-పావు కప్పు
ఆవాలు-ఒక టీ స్పూను
శనగపప్పు-1టీ స్పూను
మినపప్పు-1టీ స్పూను
కరివేపాకు-కొద్దిగా
ఉప్పు-తగినంత

తయారీ విధానం

ముందుగా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. తర్వాత పాన్‌లో నూనె వేడి చేసి నువ్వులు, ఎండుమిర్చి, కొబ్బరి తురుము వేసి వేగించాలి. వాటిని పల్లీలతో కలిపి మిక్సీలో మెత్తగా పొడి చేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత బాణలిలో నూనె పోసి వేడెక్కాక ఆవాలు, శనగపప్పు, మినపప్పు, కరివేపాకు, పసుపు వేసి పోపు పెట్టుకోవాలి. తర్వాత అందులో అన్నం, ముందుగా సిద్ధం చేసుకున్న పల్లీల పొడి వేసి బాగా కలిపి సిమ్‌లో 2 నిముషాలు ఉంచి దించేస్తే పల్లీ రైస్ రెడీ.

ఉసిరి రైస్

కావాల్సిన పదార్థాలు

బియ్యం-అరకప్పు
ఉసిరికాయలు-10
పసుపు-అరస్పూను
ఇంగువ-చిటికెడు
ఉప్పు-సరిపడా
నూనె-తగినంత
నువ్వుల పొడి-2 చెంచాలు
జీడిపప్పు-4
ఎండుమిర్చి-4(మధ్యకు కట్ చేసినవి)
పచ్చిమిర్చి-4(మధ్యకు కట్ చేసినవి)
కరివేపాకు-2 రెమ్మలు
కొత్తిమీర-1కట్ట
శనగపప్పు-1 స్పూను
మినపప్పు-ఒక స్పూను
ఆవాలు-1 స్పూను



తయారీ విధానం

ముందుగా అన్నం వండుకుని ఒక వెడల్పాటి పాత్రలో ఆరబెట్టాలి. తర్వాత ఉసిరికాయలను తరిగి అందులో ఉప్పు వేసి కచ్చాపచ్చాగా దంచాలి. పెద్ద ఉసిరికాయలైతే తురుముకోవచ్చు. తర్వాత పానులో నూనె వేడిచేసి అందులో పసుపు, ఎండుమిర్చి, శనగపప్పు, మినపప్పు, ఆవాలు వేసి రెండు నిమిషాలు వేయించాలి. తర్వాత అందులోనే పచ్చిమిర్చి, నువ్వులపొడి, కరివేపాకు, జీడిపప్పు, దంచిన లేదా తురిమిన ఉసిరికాయ ముక్కలు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత 3 నిముషాలు సిమ్‌లో ఉంచిన తర్వాత దించి కొద్దిసేపు ఆరబెట్టుకోవాలి. చల్లారిన తర్వాత అన్నంలో కలిపితే ఆమ్లా రైస్ రెడీ.

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్.. నేనొక స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: రాశీ ఖన్నా

నీడ గుర్తించండి

పిల్లలూ! ఇక్కడ బాల్‌తో ఆడుకుంటున్న ఓ చిన్నారి మీకూ కనిపించింది కదా! కింద వున్న నీడల్లో ఆ చిన్నారి సరైన నీడని గుర్తించి పెన్‌తో సున్నా చుట్టేయండి.

లెక్కించండి

ఇక్కడ నాలుగు వరుసల్లో నాలుగు రకాల బొమ్మలని వుంచాం. అయితే మీరు చేయాల్సిందల్లా అన్ని వరుసల్లో ఒకే రకంగా వున్న బొమ్మలని గుర్తించి కింద వున్న ఒక్కో బొమ్మ ఎదురుగా ఆ అంకెని రాసేయండి.



దారి కనుక్కోండి

సముద్రం ఒడ్డున ఆడుకుంటున్న ఈ చిన్నారి తన ఆట వస్తువుల్ని తెచ్చుకునే దారిని కనిపెట్టండి.



చుక్కలు కలపండి

పదాలు పూరించండి

ఇక్కడ కొన్ని బొమ్మలు వాటి పేర్లనిచ్చాం. అయితే వాటి ఇంగ్లీష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయ్యింది. బొమ్మల ఆధారంగా ఆ అక్షరాన్ని గుర్తించి అక్కడ రాసేయండి.



తేడాలు గుర్తించండి

ఇక్కడున్న బొమ్మలు చూడ్డానికి ఒకేలా ఉన్న వీటి మధ్య ఐదు తేడాలు ఉన్నాయి వాటిని గుర్తించండి..!

పెద్ద చెవుల గబ్బిలం

పిల్లలూ! మీరు చెవుల పిల్లి పేరు వినే వుంటారు. మరి చెవుల గబ్బిలాల గురించి ఎప్పుడైనా విన్నారా. చిన్న శరీరాకృతి పెద్ద రెక్కల్ని కలిగుండే సాధారణ గబ్బిలాల కంటే పొడవాటి చెవులతో ప్రత్యేకంగా కనిపించే ఈ గబ్బిలాలు యూరప్ నుండి వేరుపడిన ఒక ప్రత్యేక ద్వీపం గ్రేట్ బ్రిటన్‌లో ఎక్కువగా కనిపిస్తాయి.

◆వీటి శరీరం 3-3.7అంగుళాలుంటుంది.

◆9-10 అంగుళాలు వెడల్పున రెక్కల్ని కలిగుంటాయి.

◆వీటి శరీర పైభాగంలో వుండే బొచ్చు ముదురు గోధుమరంగులోనూ మిగిలిన శరీర భాగం లేత గోధుమ, నలుపు, బూడిద రంగుల కలగలుపుగానూ వుంటుంది.

◆శరీరం పొడవు కంటే ఎక్కువగా నాలుగు అంగుళాల పొడవు వుండే చెవులతో ప్రత్యేకంగా కనిపించే ఈ క్షీరదాల విలక్షణ రూపం ద్వారా వీటికి లాంగ్ ఇయర్డ్ బ్యాట్ అనే పేరు స్థిరపడింది.

◆అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా నివాసాలని ఏర్పరుచుకునే ఈ గబ్బిలాలు చిత్తడి నేలలు, చెరువులు, నీటి కొలనులకి దూరంగా వుండాయి. అందుకే ఇవి అన్ని గబ్బిలాల్లా నీటిలో వుండే చిన్న చిన్న జీవాల కదలికలని గమనించలేవు.

◆చెట్ల కొమ్మలు, గుహల్లో సంచరించే కీటకాల అలికిడిని గుర్తించడంలో వీటి పొడవాటి చెవులు ఎంతగానో సాయపడతాయి.

◆ఇవి చలి కాలంలో కొండ గుహలు, గనుల కందకాల్లో చేరి రోజంతా నిద్రలో గడిపేస్తుంటాయి.

◆వేసవి కాలంలో దట్టమైన అడవుల్లోని చెట్ల తొర్రల్లో చేరి కీటకాలని ఆహారంగా తీసుకుంటాయి.



◆రసాయన కలుషిత జలాలు, అడవుల నరికివేత, గనుల్లో నిర్వహించే పేలుళ్లు, ఇంధన శక్తి ప్రాజెక్ట్‌లు, పర్యావరణ మార్పుల కారణంగా అధిక సంఖ్యలో ఇవి ప్రమాదాలకి గురవడంతోపాటు వైట్ నోస్ సిండ్రోమ్ ద్వారా వీటి సంఖ్య అత్యధికంగా తగ్గిపోతోంది.

◆2010లో అంతరించి పోతున్న జాతులుగా గుర్తించబడ్డ ఈ జంతువుని కాపాడుకునేందుకు గ్రేట్ బ్రిటన్ ప్రభుత్వం పరిరక్షణా కార్యక్రమాలని చేపట్టింది. ✦

పదవికాసం - 49

కూర్పు: రావెళ్ల

1		2	3		4			5
6	7						8	
	9	10			11	12		
13				14				15
16			17				18	
		19				20		
	21		22		23		24	
25							26	27
		28			29			

ఆధారాలు

అడ్డం

2. ఆలస్యం (2)
4. ఒక జాతి ముత్యం (2)
6. రావణుని పట్టణం (2)
8. నాలుగు మూలల్లో మూడోదానికి మధ్య లోపం(2)
9. బహుమతి (3)
11. గృహం (3)
16. రుబ్బురోలులో రోలు అరిగిపోయింది (2)
17. వార్తలు తెలిపేది (3)
18. నియమం (2)
21. ఇంచు మించు (3)
23. బేరగాడు (3)
25. తల (2)
26. ఊపిరితిత్తుల వ్యాధి (2)
28. డొల్ల (2)
29. అస్పష్టమైన మాట (2)

నిలువు

1. నీరు (2)
3. మాత్ర (3)
4. వసంత ఋతువు (3)
5. ఒక పక్షి.. గవ్వకాదు (2)
7. కింది నుంచి సెగ (2)
8. పొడవాటి కర్ర (2)
10. బూడిద (2)
12. వర్షం (2)
13. జంకులేని వాడు (3)
14. కట్టెను నునుపుగా చేసే వడ్రంగి పనిముట్టు (3)
15. కెనాల్ (3)
19. భామా కలాపంలో సమూహం ఎగిరిపోయింది (2)
20. ప్రతి ఒక్కరికీ (2)
21. కత్తి తోడిది (2)
22. చేతి గుడ్డ (3)
23. మరవం లాంటిదే (3)
24. ఆటో... (2)
25. స్నేహం (2)
27. యాగం (2)

సుడోకు

5	6	1	2	7	3	8	9	4
9	3	7	4	5	8	6	1	2
8	2	4	6	9	1	7	5	3
7	1	5	3	4	2	9	6	8
2	8	3	7	6	9	1	4	5
4	9	6	8	1	5	2	3	7
1	7	9	5	8	4	3	2	6
3	5	8	9	2	6	4	7	1
6	4	2	1	3	7	5	8	9

1			5	8				4
3	8			9	6			1
9								3
	5	3			2			
6			7					5
	1		9		4	3	6	
5			4	7				
		9		1		4		2
8						1		

గతవారం జవాబులు

1 ప	ల్ల	2 వి		3 స్వే	ద	4 బిం	దు	5 వు
రో		ప్ప		చ్ఛ		బం		లు
6 ప	ల్లి		7 మా	గా	8 ణి		9 ధ్వ	ని
కా		10 అ			11 వా	11 డ		
13 రి	పు	వు		14 జూ		15 మ	న	16 సు
		17 పొ	18 పి		19 చి	రు		ధా
20 మ	ణి		21 డి	22 మి	లి		23 క్రె	క
న		24 బో		త్రు		25 ఖే		రు
26 వి	శ్వ	నా	థు	డు		27 దం	పు	డు





పచ్చటి చిత్రాలు



పత్రాలపై మన ముఖాలు కనిపిస్తాయి. మేఘాల్లో ప్రియురాలి నవ్వు తేలుతుంది. గడ్డి పరకల కదలికల్లో ఏదో దృశ్యం కదలాడుతుంది. వేటిలోనైనా ఆకారాల్ని ముఖ్యంగా ముఖాల్ని గుర్తు పోల్చుకునేలా బుద్ధి, మనసు రెండూ మనిషివి. ఇక్కడ మీరు చూస్తున్న చిత్రాలైతే ఏదో పోల్చుకున్నవి కాదు.. మనిషే గడ్డిపరకలతో సృజించినవి. వివిధ ఆకృతుల్లోకి గడ్డి రంగుల్ని మార్చి మలచి రూపొందించినవి. మనకు కిరణ జన్య సంయోగ క్రియ గురించి తెలుసు. కాంతికి పత్ర హరితం ప్రేరేపితమవుతుంది. సూర్యరశ్మి లభ్యత మీద ఆకులు, గడ్డి రంగు ఆధారపడి ఉంటుంది. తీక్షణంగా కాంతి లభిస్తే బాగా పచ్చగాను, తక్కువైతే పసుప్పచ్చగాను మారతాయి. ఈ సూత్రాన్నే ఆధారం చేసుకుని పచ్చటి పొట్రెయిట్‌లు తయారుచేస్తున్నారు... బ్రిటన్‌కు చెందిన హెథర్ అక్రాయిడ్, డాన్ హార్వేలు. ఓ చీకటి గదిలో జనపనార కేన్వాస్‌పై గడ్డి మొలకల్ని అద్దుతారు. దీనికి ఎదురుగా ఓ ప్రొజెక్టర్‌కు ఫిల్మ్ నెగటివ్ పెట్టి దాని కాంతి కేన్వాస్‌పై పడేలా చేస్తారు. నెగటివ్‌లోని షేడ్‌ల క్రమంలో గడ్డి రంగు మార్చుకుంటుంది.






ప్రకృతిల్లు

ప్రకృతే మనిల్లు. అందుకే కొందరు దానిలో మమేకమయ్యేలా తలదాచుకుంటారు. కొండ గుహలు, మహా వృక్షాల తొర్రలు, కందకాలు ఇలా మనిషి ప్రకృతివాసైపోడానికి ఎన్నో నెలవులున్నాయి. ఇప్పుడూ అలానే అంటే కొంచెం కష్టం కదా. అందుకే కొంగొత్త పోకడల్లో సరికొత్త ప్రకృతి గృహాల్ని కట్టేస్తున్నారు. అధునాతన సౌకర్యాలతో లంకె తగిలిస్తున్నారు. ఇప్పుడిదో కొత్త ట్రెండ్ అవుతోంది. పచ్చదనాన్ని దుప్పటి కప్పుకునే నేల మాళిగ గృహాలు, కొండ రాయినే పైకప్పు చేసుకున్న ఇళ్లు విలాస నివాసాలవుతున్నాయి.

Check List

Book Number	KNSR02B155	**Date**	03/09/22
Front Cover	Yes	**Back Cover**	Yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	**Cutting By**	Mounika
Scanned By	pradhyc	**Pages**	29